ప్రజాశక్తి

బుధవారం 23 ఏప్రిల్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

28న మేయర్ ఎన్నిక

- ప్రత్యేక సమావేశానికి నోటిఫికేషన్ జారీ
- కోవెలమూడి రవీంద్ర ఎన్నిక లాంఛనమే..!
- 25న సాధారణ సమావేశం పై సందిగ్ధం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర మేయర్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 28న ఉదయం 11 గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహించాలని, ఈ ఎన్నికకు గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజను ఎన్నికల అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ నెల 24 లోపు కార్పోరేటర్లకు, ఎక్స్ అఫిషియో సభ్యులకు సమాచారం ఇచ్చి నోటీసులు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతనెల 15న నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు రాజీనామా నేపథ్యంలో నూతన మేయర్ ఎన్నిక అనివార్యమైంది. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం హాలులో జరిగే మేయర్ ఎన్నికకు జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ అధ్యక్షత వహిస్తారని ఎలక్షన్ అథారిటీ, మున్సిపల్ పరిపాలనా డైరెక్టర్ డాక్టర్ పి.సంపత్ ఉత్తర్వులు జారీచేశారు.

మేయర్‌గా టిడిపి నుంచి 37వ డివిజన్ కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్ర ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యే అవకాశం ఉంది. గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ లో మొత్తం 56 మంది కార్పొరేటర్లు ఉండగా 34 మంది టిడిపి కూటమికి మద్దతు దారులుగా ఉన్నారు. దీంతో అనివార్యమైన పరిస్థితుల్లో గత నెల 15న కావటి మనోహర్ నాయుడు మేయర్ పదవికి రాజీనామా చేశారు. గుంటూరు నగరపాలక సంస్థపై టిడిపి పూర్తిస్థాయిలో పట్టు సాధించడంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టడానికి టిడిపి కూటమి నాయకులు సన్నాహాలు చేసుకుంటున్న తరుణంలో కావటి మనోహర్ నాయుడు ముందుగానే పదవి నుంచి వైదొలిగారు. ఫిబ్రవరి 3న జరిగిన స్టాండింగ్ కమిటీ



ఎన్నికల్లో ఆరు స్థానాలను టిడిపి, జనసేన గెలుపొందాయి. వైసిపి సభ్యులు కొంత మంది క్రాస్ ఓటింగ్ వల్ల టిడిపికి 34 ఓట్లు వచ్చాయి. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కార్పొరేషన్‌లో పూర్తిస్థాయిలో టిడిపి కూటమి పట్టు సాధించినట్లయింది. గత నాలుగేళ్ల కాలంలో టిడిపి సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై కూడా గుర్రుగా ఉన్న ఆ పార్టీ నాయకులు పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు తనకి తాను రాజీనామా చేసే పరిస్థితిని కల్పించారు. తరువాత ఇన్‌చార్జి మేయర్‌గా డిప్యూటీ మేయర్ షేక్ సజీల నియామకం ద్వారా కార్పొరేషన్‌పై టిడిపి కూటమి పూర్తి స్థాయిలో పట్టు సాధించింది. ఈ నేపథ్యంలో నూతన మేయర్ గా కోవెలమూడి రవీంద్ర ఎన్నిక లాంఛనమే కానుంది.

25 కౌన్సిల్ భేటీ లేనట్టేనా..?

గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ సమావేశం ఈనెల 25వ తేదీన నిర్వహించాలని ఇప్పటికే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 90 ప్రశ్నలు, 69 ప్రియాంబుల్స్‌తో ఎజెండా రూపొందించారు. అయితే మేయర్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయడంతో సాధారణ సమావేశం నిర్వహించే అవకాశం లేదని, వచ్చేనెల నాలుగో తేదీ తర్వాత మాత్రమే సమావేశం జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై ఇంకా అధికార ప్రకటన వెలువడలేదు.

నేడు పదో తరగతి ఫలితాలు

ప్రజాశక్తి-గుంటూరు

పదోతరగతి పరీక్షా ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల కానున్నాయి. రెగ్యులర్‌తోపాటు, సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్ ఫలితాలు కూడా విడుదల చేస్తారు. ఫలితాలను https://bse.ap.gov.in, https://apopenschool.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా ఫలితాలు పొందవచ్చు. మన మిత్ర వాట్సాప్ యాప్, లీప్ మొబైల్ యాప్‌లలోనూ ఫలితాలు అందుబాటులో ఉంటాయి. మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు హాయ్ అని మెస్సేజ్ చేసి, విద్యాసేవలను ఎంపిక చేసుకొని, ఆ తర్వాత ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు ఫలితాలను ఎంచుకోవాలి. అభ్యర్థి రోల్ నెంబర్ నమోదు చేస్తే ఫలితాలు వస్తాయి. కాగా మార్చి 17 నుండి ఏప్రిల్ 1 వరకూ జరిగిన పరీక్షల్లో గుంటూరు జిల్లా నుండి 26,497 మంది, పల్నాడు జిల్లా నుండి 31,543 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎన్.వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయుల కేటాయింపులో అసమానతలను సరిదిద్దాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రాథమిక పాఠశాలలని 4 రకాలుగా విభజించి విద్యార్థి ఉపాధ్యాయుల నిష్పత్తి రకరకాలుగా నిర్ణయించడం సరికాదని, అన్ని పాఠశాలల్లో ఒకే రకంగా ఉండాలని ప్రభుత్వాన్ని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధ్యాయుల బదిలీల చట్టంపై స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫౌండేషన్ స్కూల్లో 30 మంది పిల్లలకు ఒక టీచరు, మోడల్ ప్రైమరీ స్కూల్లో 20 మంది పిల్లలకు ఒక టీచరు, హైస్కూల్ ప్రైమరీలో 10 మంది పిల్లలకు ఒక టీచరును కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని పాఠశాలల్లో కేటాయింపులు ఒకే విధంగా ఉండాలని, అందరికీ ఒకే రకమైన నాణ్యమైన విద్య అందాలని అన్నారు. 2లో



నిరసనలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

అమెరికాతో ఒప్పందాలు మన రైతులకు నష్టం

ప్రజాశక్తి-గుంటూరు

అమెరికా ఉపాధ్యక్షులు జెడి వ్యాన్స్ పర్యటనను నిరసిస్తూ గుంటూరులో భగత్‌సింగ్ సెంటర్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమన్వయ సమితి, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ అమెరికా ఉత్పత్తులు భారతదేశానికి దిగుమతి చేస్తే ఇక్కడున్న రైతులు నష్టపోవటమే కాకుండా ఉపాధి కోల్పోయి వీధిన పడతారన్నారు. పైగా భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై పెద్ద ఎత్తున సుంకాలు విధించడం భారత వ్యవసాయానికి తీవ్ర నష్టమని చెప్పారు. భారత రైతులకు నష్టం చేసే ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారీఫ్‌ల వల్ల భారత ప్రజలకు తీవ్ర-నష్టం కలుగుతుందని, వ్యవసాయ రంగం దెబ్బతింటుందని, అమెరికాతో ఒప్పందాలేమీ చేసుకోవద్దని డిమాండ్ చేశారు. రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ భారతదేశంలో రైతులు పండిస్తున్న పంటల ధరలను దెబ్బతీసే విధంగా అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతికి అనుకూలంగా మోడీ ప్రభుత్వం సిద్ధపడటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు జి.ఈశ్వరయ్య, డాక్టర్ కొల్లా రాజమోహన్, వై.రాధాకృష్ణ, కె.అజయ్ కుమార్, జమలయ్య, ఎం.వెంకటరెడ్డి, ఎం.హరి ప్రసాద్, వి.నరసింహారావు పాల్గొన్నారు.

సివిల్స్‌లో పల్నాటి బిడ్డలు!

రుద్రవరం యువకునికి 146వ ర్యాంకు, సత్తెనపల్లి డాక్టర్‌కు 797వ ర్యాంకు



తల్లిదండ్రులు భువనేశ్వరి, రమేష్‌తో చల్లా పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన చల్లా పవన్ కల్యాణ్‌కు సివిల్స్‌లో 146 ర్యాంకు సాధించారు. చల్లా రమేష్, భువనేశ్వరి దంపతులు తమ కుమారుడైన పవన్ కళ్యాణ్ చదువు కోసం గుంటూరుకు కొన్నేళ్ల కిందటే వచ్చారు. రమేష్ వ్యవసాయదారుడు కాగా ఆయన భార్య భువనేశ్వరి బిఇడి చదివారు. పవన్ కల్యాణ్‌ను చిన్నతనం నుండి చదువులో ప్రోత్సహిస్తూ ఆయన ఈ స్థాయికి వచ్చేలా వెన్నంటే ఉన్నారు. గుంటూరులోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్‌లో చదివిన పవన్‌కల్యాణ్ పదో తరగతి (2014)లో 10 జిపిఎ సాధించారు.ఇంటర్మీడియట్ శ్రీ చైతన్య కాలేజీ గూడవల్లి క్యాంపస్‌లో చదివి 987 మార్కులు సాధించారు. ఎన్ఐటిలో తిరుచునాపల్లిలో బీటెక్ చదివిన అనంతరం సివిల్స్‌కు సిద్ధమయ్యారు. తొలి ప్రయత్నంలో ఇంటర్వ్యూ దశ వరకు వెళ్లినా ఎంపికవలేదు. రెండో ప్రయత్నంలో సాధించారు. పవన్‌కల్యాణ్‌కు టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తెలుగు మహిళ నియోజవర్గ అధ్యక్షులు చల్లా అనుపకళ అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్



పెండెం ప్రత్యూష్

మొన్నటి వరకు ఆయన డాక్టర్.. వంటిపైన తెల్లకోటు, మెడలో సెతస్కోప్‌తో రోగుల నాడి పట్టి, గుండె తట్టి పరీక్షలు చేసిన ఆయన ఇప్పుడు తన పాత్రను మార్చుకోబోతున్నారు. ఒంటిపైన తెల్లకోటు బదులు ఖాకి డ్రస్, చేతికి లాఠీ రానుంది. రోగాలు నయం చేసే ఆయన సామాజిక రుగ్మతలకు ఇకపై వైద్యం చేయనున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని దారిలో పెట్టే బాధ్యతను తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆయనే సత్తెనపల్లికి చెందిన పెండెం ప్రత్యూష్..

పట్టణంలోని రైల్వే గేట్ వద్ద అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉండే న్యాయవాది పెండెం బాబురావు, పద్మ దంపతుల రెండో కుమారుడైన ప్రత్యూష్ 2021-22లో మెడికల్ సైన్స్ ఆప్షన్‌గా తీసుకొని సివిల్స్ రాశారు. ప్రిలిమినరీ ఉత్తీర్ణులైనా మెయిన్స్ వద్ద బ్రేకు పడింది. అయితే అప్పటికే గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేయడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాల్లో వైద్య సేవలు అందిస్తున్నాడు. 2023-24 ఆంత్రోపాలజీ ఆప్షన్‌గా తీసుకొని ఓ పక్క వైద్య సేవలు అందిస్తూనే మరోక పక్క సివిల్స్‌కు సిద్ధమయ్యారు. పట్టుదలతో కృషి చేసి రెండో ప్రయత్నంలో 797 ర్యాంక్ సాధించి ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. కృషి, 2లో



పెండెం ప్రత్యూష్‌కు అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు

సివిల్స్‌లో పల్నాటి బిడ్డలు!

(మొదటి పేజీ తరువాయి)

పట్టుదల, సాధించాలని తపన ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నిరూపించాడు పెండెం ప్రత్యూష్. తొలి ప్రయత్నంలో సివిల్స్ సాధించలేకపోయినా నిరుత్సాహ పడకుండా ఒకవైపు వైద్యం అందిస్తూనే మరోవైపు సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. ఇందుకు వారి తల్లిదండ్రులు సహకారమూ కలిసొచ్చింది.

న్యాయవాదుల అభినందనలు

న్యాయవాది పెండెం బాబురావు కుమారుడు ప్రత్యూష్ 797 ర్యాంకుతో ఐపిఎస్ సాధించడంతో మంగళవారం సాయంత్రం పలువురు న్యాయవాదులు ప్రత్యూష్ ఇంటికెళ్లి అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూలీ అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు చిన్నం మణిబాబు, ఏపీపీ బగ్గి నరసింహారావు, న్యాయవాదులు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, షేక్ జానీభాజావలి, సూరె వీరయ్య, రాజవరపు శివనాగేశ్వరరావు, లక్ష్మణ్, బగ్గి పవన్ కుమార్, శెట్టి ఆనంద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అసమానతలను సరిదిద్దాలి

(మొదటి పేజీ తరువాయి)

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.ఎన్.కుసుమకుమారి మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ టీచర్లను కేటాయించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి మోడల్ ప్రాథమిక పాఠశాలకు ఐదుగురు టీచర్లను తప్పనిసరిగా కేటాయించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల లభ్యతను బట్టి విద్యా విధానాన్ని మార్పులు చేయటం కాకుండా, ఒక ఉన్నతమైన విద్యా విధానాన్ని రూపొందించి, దానికి తగ్గట్టు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి, జిల్లా కోశాధికారి ఎమ్.డి.దౌలా, కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎ.గోవిందు, ఎమ్.డి.షకీలాబేగం, కె.రంగారావు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - మేడికొండూరు

గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల అధికారులతో మండల కేంద్రమైన మేడికొండూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో రెండు మండలాల్లో ఉన్న అన్ని గ్రామాలలో ఎలాంటి తాగునీటి సమస్యా రాకుండా ముందస్తు ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నటువంటి పలు రకాల సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేలా చూడాలని, అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. వివిధ సమస్యలపై వచ్చే ప్రజల అర్జీలను సత్వరం పరిష్కరించాలని సూచించారు.

గేమింగ్ సంస్థ యజమాని మోసం - వ్యాపారి మృతి

- రూ.కోట్లల్లో పెట్టుబడులు పెట్టిన మరికొందరిలోనూ తీవ్ర ఆందోళన
- రూ.400 కోట్ల వరకూ ఇచ్చిన నరసరావుపేట వ్యాపారులు
- కొందరైతే రూ.40 కోట్ల వరకూ!

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యాపిక్స్ యానిమేషన్ గేమ్‌లో రూ.5 కోట్లు పెట్టుబడులు పెట్టడంతోపాటు మరి కొందరితో పెట్టుబడులు పెట్టించిన నరసరావుపేట పట్టణం సాయినగర్‌కు చెందిన గుండా నాగేశ్వరరావు (55) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. 2014లో మొదలైన యాపిక్స్ యానిమేషన్ సంస్థ యజమాని అయిన విజయవాడకు చెందిన కిరణ్ పలువురు వ్యాపారులను మోసం చేస్తూ 4 ఏళ్ల క్రితం నరసరావుపేటకు చెందిన పలువురు వ్యాపారులతో పరిచయం పెంచుకుని అధిక మొత్తంలో కమీషన్లు ఇచ్చి ఆశ చూపాడు. రూ.లక్ష ఇస్తే వడ్డీగా రూ.లక్ష కలిపి ఇస్తానని ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే నాగేశ్వరరావుకు కిరణ్‌తో పరిచయం ఏర్పడింది. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. యాపిక్స్ యానిమేషన్ సంస్థ యజమాని కిరణ్‌కు నాగేశ్వరరావు రూ.5 కోట్లను నాగేశ్వరరావు పెట్టుబడిగా ఇవ్వడంతోపాటు తనకు తెలిసిన వారితోనూ కోట్లల్లో పెట్టుబడి పెట్టించాడు. దీంతోపాటు నరసరావుపేటకు చెందినవారే దాదాపు 400 కోట్ల వరకు యాపిక్స్ సంస్థలో పెట్టుబడులు పెట్టారని తెలిసింది. ఎనిమిది మంది అయితే ఒక్కొక్కరు రూ.30 నుండి 40 కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టారని సమాచారం. ఈ క్రమంలో యాపిక్స్ సంస్థ యజమాని కిరణ్ పరారయ్యాడనే సమాచారంతో నాగేశ్వరరావు తీవ్ర ఆందోళన బయలుదేరింది. మానసికంగా సతమతమైన గుండా నాగేశ్వరరావు మంగళవారం గుండె నొప్పితో తీవ్ర అనారోగ్యానికి గురవడంతో కుటుంబీకులు మంగళవారం మధ్యాహ్నం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.



మృతుడు గుండా నాగేశ్వరరావు (ఫైల్)

యాపిక్స్ యానిమేషన్ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయి ఆ ఒత్తిడితోనే నాగేశ్వరరావు గుండెపోటుకు గురై చనిపోయినట్లు కుటుంబీకులు వాపోతున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా యాపిక్స్ సంస్థలో పెట్టుబడులు పెట్టిన కొంతమంది దాని యజమాని కిరణ్‌ను ఇటీవల తమిళనాడులో గుర్తించి ప్రశ్నించగా డబ్బులు తిరిగిస్తానని మాటిచ్చారని, ఆ తర్వాత మళ్లీ ఆచూకీ లేదని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థలో పెట్టుబడులు పెట్టిన నరసరావుపేటకు చెందిన పలు వ్యాపారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

జీతాల కోసం ఆయుష్మాన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ ఆయుష్మాన్ ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద నిరసన, అనంతరం ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.ప్రవళిక, జనరల్ సెక్రటరీ పి.లింగరాజు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జి.వనజ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, రెండేళ్లుగా జీతాల విషయంలో సమస్యలను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్లుగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న తాము ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ బకాయిలు వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని కోరారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుండి సిహెచ్ఒలను మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ ఇంక్రిమెంట్ ట్రాన్స్‌ఫర్ పితృత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ ఆఫీసర్లుగా ఆరేళ్ల తర్వాత రెగ్యులర్ చేయాలన్నారు. 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తాము రెండేళ్లుగా జీతాల విషయంలో తీవ్ర నిరాశను ఎదుర్కొంటున్నామని, 2023లో ఎన్‌హెచ్ ఉద్యోగులందరికీ 23 శాతం వేతన సవరణ ఇచ్చినా తమకు మాత్రం వేతన సవరణ చేయకపోగా ప్రతినెలా ఇవ్వాల్సిన ప్రోత్సాహకాల్లోనూ జాప్యం చేస్తున్నారని, తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 జూలై నుంచి ఆన్లైన్ విధానంలో చెల్లింపులు జరిపిన పి.బి.ఐలో ఉన్నటువంటి అవకతవకల వల్ల చాలా నష్టపోయామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నూర్జహాన్, సంధ్యరాణి, కొడాలి సజన పాల్గొన్నారు.

వర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో అన్ మ్యానెడ్ ఏరియల్ వెహికల్స్ మరియు అడ్వాన్సెస్ మరియు అప్లికేషన్స్ అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఇన్‌ఛార్జి వీసీ కంచర్ల గంగాధరరావు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌విడిఐఎ టెక్నాలజీని వాడి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీస్ డ్రోన్‌లో ఉపయోగిస్తున్నారని వాటి అన్నిటి మీద అవగాహన పెంచుకొని డ్రోన్ టెక్నాలజీలో అన్ని విభాగాల విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ సాధించాలని తెలిపారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ గడిమిశెట్టి సురేష్ కీలకోపన్యాసం చేస్తే కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీని రాష్ట్రప్రభుత్వం నిర్మిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ వరదల సమయంలో డ్రోన్ సేవలను వివిధ రూపాల్లో వినియోగించుకొని త్వరితగతిన సేవలందించడం జరిగిందని అన్నారు. విశిష్ట అతిథులుగా విజయ్ వీరమల్లు సి.టి.ఓ. ఆర్ అండ్ డి మ్యానుఫ్యాక్చరింగ్ పవ మాన్ ఏవియేషన్, హైదరాబాద్. మాట్లాడుతూ వర్టికల్ టేక్ ఆఫ్ అండ్ ల్యాండింగ్ (వి టి ఒ ఎల్) మరియు ఫిక్స్డ్ వింగ్స్ మీద అవగాహన కలిగించారు. హృషికేశ్ వాడ్కర్ ,ఎకౌంటబుల్ మేనేజర్, ఆర్ .పి .టి. ఓ. పవమాన్ ఏవియేషన్ హైదరాబాద్ మాట్లాడుతూ డ్రోన్ యొక్క ట్రైనింగ్ మరియు డెమో ఇచ్చారు. వంశీధర్ మజ్జి, సీ.ఈ.ఓ ఏరో మైండ్స్ డ్రోన్ సర్వీసెస్, విజయవాడ మాట్లాడుతూ డ్రోన్ యొక్క ఫ్యూచర్ ట్రెండ్స్ గురించి తెలిపారు. సాయికృష్ణ అనురూప్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి మరియు సీ.ఈ.ఓ . ట్రీ.డి .హబ్స్ మాట్లాడుతూ ఆయన యూనివర్సిటీలో ఉన్న అవకాశాలను ఉపయోగించుకొని ఈ స్థితికి ఎదిగానని మీరు కూడా ఉన్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఎమ్‌డి తౌ షిఫ్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు ట్రెజరర్ డాక్టర్ సిహెచ్. తిరుమలరావు, రిజిస్ట్రార్ జి.సింహాచలం మాట్లాడారు. రెక్టర్ రత్న శీలామణి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పి.సిద్ధయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గడిమిశెట్టి సురేష్





బహుమతులు అందుకుంటున్న బాలికల జట్టు

షటిల్ విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక చెంచుపేట ఎన్టీఆర్ బ్యాట్మెంటన్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు పట్టణ స్థాయిలో బుధవారం షటిల్ బ్యాట్మెంటన్ పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో బాలబాలికలకు నిర్వహించిన పోటీలలో మొత్తం 30 జట్లు పాల్గొన్నట్లు కోచ్ ఎస్ వినయ్ కుమార్ తెలిపారు. పోటీలలో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్ గా సందీప్ అండ్ కార్తికేయ, రన్నర్స్ గా దర్షిక్ అండ్ భార్గవ్ నిలిచారు. అలాగే జూనియర్స్ బాలుర విభాగంలో రోహిత్ అండ్ లోవంత్ విన్నర్స్ గా, జయదీప్ అండ్ జోయల్ రనర్స్ గా నిలిచారు. సీనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్ గా మహేష్ అండ్ రిత్విక్, రన్నర్స్ గా ముకుంద అండ్ కార్తికేయన్ గెలుపొందారు. జూనియర్స్ బాలికల విభాగంలో విన్నర్స్ గా లాస్య అండ్ మౌళ్య, రమ్నర్స్ గా దక్షిత అండ్ రోష్మిత, సీనియర్స్ విభాగంలో విన్నర్స్ గా దుహిత అండ్ పూజా శ్రీ, రన్నర్స్ గా సాయి ప్రియ అండ్ జయశ్రీ గెలుపొందారు. పోటీలను శ్రీనివాస్, సాయి లలిత, లోకేష్ పర్యవేక్షించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాయి కష్ణ రవిశంకర్, జయశ్రీ, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుని అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సిఐ హైమారావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల బరంపేటలో చోటు చేసుకున్న ఓ హత్య కేసులో నిందితుడైన ఆకుల కిషోర్‌ను మంగళవారం అతని ఇంటి వద్దనే అరెస్టు చేసినట్లు రెండవ పట్టణ సిఐ ఎం. హైమారావు తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ గుంటూరు గుజ్జనగుండ్లకు చెందిన కిషోర్ పట్టణానికి చెందిన శివకుమారిని వివాహం చేసుకున్నాడని మనస్పర్థలు తలెత్తడంతో భార్య శివకుమారి పట్టణంలోని బరంపేటలో గల తన పుట్టింటికి వచ్చి తల్లి నాగమ్మతో కలిసి ఉంటుందన్నారు. ఈ క్రమంలో కిషోర్ కూడా బరంపేట లోని తన అత్త నాగమ్మ ఇంటి వెనుక వైపు ఉంటూ, ఆస్తిలో వాటా ఇవ్వమని గొడవ చేస్తుండగా నాగమ్మ ఇంటి నుండి కిషోర్‌ను ఖాళీ చేయించిందన్నారు. ఇంటిని నాగమ్మ గోపిదేశి వెంకటేష్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చిందన్నారు. కిషోర్ తరచూ నాగమ్మ ఇంటి వద్దకు వచ్చి ఆస్తిలో వాటా ఇవ్వమని బజార్లో గొడవ చేస్తుండగా వెంకటేష్ వారించడాన్ని ఓర్వలేని కిషోర్ వెంకటేష్‌ను ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 19న రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన వెంకటేష్ తలపై కిషోర్ బలంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారన్నారు. వెంకటేష్ భార్య అనురాధ బంధువులు చికిత్స నిమిత్తం నరస రావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఈనెల 20న మృతి చెందారన్నారు. మృతుని భార్య అనూరాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. వెంకటేష్ మృతి విషయం తెలుసుకున్న కిషోర్ పరారీలో ఉండి మంగళవారం అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చిన విషయం తెలుసుకుని ఎస్సై లేఖ ప్రియాంక, తిరుమలరావు సిబ్బంది కలిసి అదుపులోకి తీసుకున్నారన్నారు. కిషోర్ పై గతంలో సస్పెక్ట్ షీట్ ఉందని 8 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. కిషోర్‌పై రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా
అరండల్‌పేట బ్రాంచి, గుంటూరు.

డి.నెం.6-4-21, 4/3, అరండల్‌పేట, గుంటూరు, గుంటూరు జిల్లా, ఏపి.

అమ్మకానికి ముందు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (SARFAESI Act-2002) లోని రూల్ 8(6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడింది.

టు,

ఋణగ్రహీత: మెస్సర్స్. ఎబికె గ్రీన్ & ఆగ్రో వెంచర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న భాగస్వాములు: శ్రీ కంచర్ల ఆనంద్ బాబు & శ్రీమతి కంచర్ల విజయ కుమారి, 25-17-125 పాత, 84-23-1955 కొత్త, 12/3, శ్రీనివాసరావుపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. **సహ-ఋణగ్రహీత: 1. శ్రీ కంచర్ల ఆనందబాబు (భాగస్వామి/ఋణగ్రహీత),** డి.నెం. 25-16-85, ఫ్లాట్ నెం. 204-బి, రిషి వ్యాలీ అపార్ట్‌మెంట్, శ్రీనివాసరావుపేట మెయిన్ రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, పిన్-522004. **2. శ్రీమతి కంచర్ల విజయకుమారి (భాగస్వామి/ఋణగ్రహీత),** భర్త: యు.బాలు, డి.నెం. 408, బి-బ్లాక్, టెంపుల్ ట్రీ పార్క్ అపార్ట్‌మెంట్, అంకిరెడ్డిపాలెం రోడ్డు, నల్లపాడు, గుంటూరు-522005.

డియర్ సార్ / మేడమ్,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (SARFAESI Act-2002) లోని రూల్ 8(6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడింది.

బ్యాంక్ ఆఫ్ బరోడా, అరండల్ పేట బ్రాంచి, గుంటూరు తరపున ఈ దిగువ తెలిపిన సంబంధిత ఋణ ఖాతాలకు సంబంధించిన ఋణగ్రహీతలు, హామీదారులు, తనఖాదారులకు మరియు చట్టబద్ధమైన వారసులకు క్రింద తెలియజేసిన మొత్తములు చెల్లించవలసినదిగా చట్టం యు/సెక్షన్ 13(2) కు అనుబంధమైన రూల్ 3 తో చదవబడిన అధికారాలను వినియోగించుకుని **ది.28-06-2024** న డిమాండ్ నోటీసు జారీ చేసినారు. ఈ నోటీసు అందిన 60 రోజులలోగా మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరారు.

ఋణగ్రహీతలు / హామీదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, బ్యాంక్ ఆఫ్ బరోడా, అధీకృత అధికారి, ఆ చట్టంలోని యు/సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 4 మరియు/లేదా రూల్ 8 ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, **ది.13.02.2025** నాటి స్వాధీన నోటీసులో పూర్తిగా వివరించిన విధంగా సెక్యూర్డ్ ఆస్తులను (ఇక్కడ పేర్కొన్న ఆస్తి / ఆస్తులు) స్వాధీనం చేసుకున్నారు మరియు SARFAESI చట్టం క్రింద పరిగణించబడిన నియమాలలోని రూల్ 8 (1) మరియు రూల్ 8 (2) కి అనుగుణంగా, ప్రాంతీయ భాష మరియు ఇంగ్లీషు వార్తా పత్రికలలో ఆయా తేదీలలో సదరు స్వాధీనతా ప్రకటన కూడా ప్రచురించడమైనది.

ఋణగ్రహీత /హామీదారు యొక్క స్థిరాస్తుల స్వాధీనానికి అనుగుణంగా, SARFAESI చట్టం 2002 యు/సెక్షన్ 13 (4) (ఎ) క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, ఈ దిగువ సంతకందారు క్రింద తెలిపిన ఆస్తులను విక్రయించడం ద్వారా బ్యాంక్ బకాయిలను వసూలు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. కావున సబ్జెక్ట్ చట్టంలోని నిబంధనలు మరియు దాని కింద రూపొందించిన నియమాల ప్రకారం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) కింద అమ్మకానికి ముందు మొత్తం బాధ్యతను నిర్వర్తించడానికి ఈ 30 రోజుల నోటీసును నేను అందిస్తున్నాను.

మీ అందరు ఈ నోటీసు తేది నుండి 30 దినములలోగా దిగువ తెలిపిన పూర్తి బకాయి మొత్తమును ప్లస్ తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి, బ్యాంక్ స్వాధీనంలో నున్న దిగువ చెప్పబడిన ఆస్తిని విడిపించుకోవలసినదిగా చిట్టచివరి అవకాశం ఇవ్వడమైనది. అట్లు చేయడంలో విఫలమైనచో **"ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నదో అలా" "అక్కడ ఏది ఉంటే అది"** మరియు **"సహాయం లేకుండా"** పద్ధతి ద్వారా నిబంధనలలో పేర్కొన్న రూల్ 8(5) క్రింది పద్ధతుల్లో దేనినైనా అనుసరించడం ద్వారా ఆస్తులు విక్రయించబడతాయి:

(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులతో లావాదేవీలు చేస్తున్న వ్యక్తుల నుండి కొటేషన్లు పొందుట ద్వారా లేదా
(బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా
(సి) ఇ-వేలం పద్ధతి ద్వారాతో పాటు బహిరంగా వేలం నిర్వహించుట ద్వారా లేదా
(డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా

స్థిరాస్తుల వివరణ

ఆస్తి-1: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్‌జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, రామచంద్రపురం అగ్రహారం, పట్టా నెం.1053, బ్లాక్ నెం.లు.20, 21, డి.నెం.4/1బి, డోర్ నెం. 25-17-125 లో ఎకరా 10.78 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో 183.2/9 చ.గ.ల స్థలం మరియు అందు గల పెంకుటిల్లు తో పాటు, షెడ్యూల్ ఆస్తి యొక్క అసెస్సెమెంట్ నెం.37111/డి.ఎన్ తో హద్దులు: **తూర్పు:** షేక్ జబ్బార్ గారికి చెందిన ఇంటి స్థలం-48.6 అడుగులు, **పడమర:** నరుబోయిన సాంబయ్య గారికి చెందిన డాబా ఇల్లు-48.6 అడుగులు, **ఉత్తరం:** అంబంటి మార్కండేయులు గారికి చెందిన ఇల్లు-36.6 అడుగులు, **దక్షిణం:** 20 అడుగుల వెడల్పు గల మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు-31.6 అడుగులు. ఈ హద్దులలో 183.2/9 చ.గ.ల స్థలం మరియు పెంకుటిల్లు ఉన్నాయి. (గుంటూరు, శ్రీనివాసరావుపేట, కార్మిక సంఘం) భూ సంస్కరణల కమిషనర్.

ఆస్తి-2: గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్టర్ జిల్లా, బాపట్ల సబ్‌జిల్లా, అడవి గ్రామ పంచాయితీ ఏరియా, అడవి గ్రామం, డి.ఈ.నెం.269/2లో ఎకరా 0.03 సెంట్లు, డి.నెం.282లో మొత్తం ఎకరా 5.88 సెంట్లు విస్తీర్ణంలో ఎకరా 2.62 సెంట్లు. కాబట్టి బాపట్ల తహశీల్దార్ ప్రకారం రెండు డి.నెం.లలో గల ఒకే ముక్క భూమి అయిన ఎకరా 2.62 సెంట్లు. నిర్వహించిన రీసర్వే ప్రకారం I.DS No.649/2015-A, ది.22.06.2016, డి.నెం.282లో విస్తీర్ణం ఎకరా 2.49 సెంట్లు, ది.23.12.2015 ప్రకారం D.T.L.P No.6481/2/2015-16/G, ప్లాట్ నెం.లు. 51, 52, 53, 54, 55 ప్రకారం, 1200 చ.గ.ల స్థలం యొక్క అభిప్రాయ షెడ్యూల్ ఆస్తి హద్దులు: **తూర్పు:** 33 అడుగుల వెడల్పు రోడ్డు-216 అడుగులు, **పడమర:** ప్లాట్ నెం. 56 & 60-216 అడుగులు, **ఉత్తరం:** 33 అడుగుల వెడల్పు రోడ్డు-50 అడుగులు, **దక్షిణం:** 40 అడుగుల వెడల్పు రోడ్డు-50 అడుగులు.

ఆస్తి-3: గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్టర్ జిల్లా, బాపట్ల సబ్‌జిల్లా, అడవి గ్రామ పంచాయితీ ఏరియా, అడవి గ్రామం, డి.ఈ.నెం.269/2లో ఎకరా 0.03 సెంట్లు, డి.నెం.282 లో మొత్తం ఎకరా 5.88 సెంట్లు విస్తీర్ణంలో ఎకరా 2.62 సెంట్లు. కాబట్టి బాపట్ల తహశీల్దార్ ప్రకారం రెండు డి.నెం.లలో గల ఒకే ముక్క భూమి అయిన ఎకరా 2.62 సెంట్లు. నిర్వహించిన రీసర్వే ప్రకారం I.DS No.649/2015-A, ది.22.06.2016, డి.నెం.282లో విస్తీర్ణం 244.44 చ.గ.లు, ప్లాట్ నెం. 62 లో విస్తీర్ణం 60 చ.గ.లు, రెండు ప్లాట్‌లలో విస్తీర్ణం 304.44 చ.గ.లలో ఆర్.సి.సి డాభా ఇల్లు యొక్క అభిప్రాయ షెడ్యూల్ ఆస్తి హద్దులు: **తూర్పు:** ప్లాట్ నెం. 63, 54 అడుగులు, ప్లాట్ నెం. 64 అక్కల రామిరెడ్డి గారికి చెందినది-44 అడుగులు కాబట్టి 98 అడుగులు, **దక్షిణం:** పెనుమచ్చ నాగరాజు గారికి చెందిన స్థలం-50 అడుగులు, పడమర: పెనుమచ్చ నాగరాజు & డొంకకు చెందిన స్థలం-44 అడుగులు. ఉత్తరం: ప్లాట్ నెం.62లో స్థలం కొంత భాగం-40 అడుగులు, **మళ్ళీ పడమర:** ప్లాట్ నెం.62 లో స్థలం కొంత భాగం-54 అడుగులు, **మళ్ళీ ఉత్తరం:** 40 అడుగుల వెడల్పు గల రోడ్డు-10 అడుగులు. పైన పేర్కొన్న హద్దులలో 304.44 చ.గ.ల విస్తీర్ణంలో ఉన్న స్థలంతో పాటు ఆర్.సి.సి రూఫ్ గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు నివాస ఇల్లు. CERSAI ID/s: 400053139304, 400053140990 & 400053142421

సౌకర్యాల వివరములు	డిమాండ్ నోటీసు తేదీ:	స్వాధీనత నోటీసు తేదీ:	స్వాధీనత నోటీసు ప్రచురించిన తేదీ:
OD (Baroda Property prode), Limit - Rs.144.00 Lakhs WCTL under BGECLS - Rs 42.00 Lakhs	28-06-2024	13-02-2025	19-02-2025
	ది. 22-06-2024 నాటికి చెల్లించాల్సిన బకాయి మొత్తం: రూ.1,81,38,659/- (అక్షరాలా ఒక కోటి ఎనభై ఒక్క లక్షల ముప్పై ఎనిమిది వేల ఆరు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే) + **ది. 23.06.2024** నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు ఏవైనా ఉంటే చెల్లించే వరకు.		

చట్టం నందు / అమలులోనున్న ఏదైనా ఇతర న్యాయ పరిధిలో బ్యాంక్‌కు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయటమైనది.

తేది: 20-03-2025
ప్రదేశము: గుంటూరు **చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి**

మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P No. 31 /2023 IN O.S No. 47/2020

బిట్వీన్ :-
నల్లూరి నరేష్ ..... పిటిషనర్ - డి.హెచ్.ఆర్
అండ్
పుల్లెల సురేష్ ...... రెస్పాండెంట్- జె.డి.ఆర్

పుల్లెల సురేష్, తండ్రి వెంకట సుబ్బయ్య, వయసు 38 సం, వృత్తి : వ్యవసాయం, నివాసం : లగడపాడు గ్రామం, పెదకూరపాడు మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

పై నెంబరు గల ఈ.పి లో రెస్పాండెంట్- జె.డి.ఆర్ అయిన మీకు ఎన్ని మార్లు కోర్టు మరియు పోస్ట్ ద్వారా అనేక మార్లు ఈ.పి నోటీసులు పంపినన్నూ, మీరు నోటీసులు తీసుకోకుండా దాటవేస్తున్నందున, పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చుమని శ్రీ కోర్టు వారు ఆర్డర్ వేసియున్నందున మీరు కోర్టు ఎదుట మీ యొక్క హాజరు నిమిత్తం ది. 08-5-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30గం.లకు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 08-5-2025

గంగూరి అజయ్ కుమార్,
పిటిషనర్ - డి. హెచ్.ఆర్ తరపు న్యాయవాది,
సత్తెనపల్లి.
సెల్: 9885541122

CHANGE OF NAME

I Chakali Madhu Babu (Old Name), S/o Chakali Madduleti, R/o. H.No. 4-29-23/1, Nandulapeta, E.T. Colony, Near TDP Youth office, Tenali, Guntur District. 522201. Andhra Pradesh. Have changed my name known as TUDUMALADINNE MADHU BABU S/o Tudumaladinne Madduleti (New Name). Here after my name is known as **TUDUMAL-ADINNE MADHU BABU**

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

పల్నాడు జిల్లా, నరసరావుపేట పట్టణం, కోట సెంటర్, ఐలాబజార్, R/D No:20-3-26 కు చెందిన ఏరువా లక్ష్మీ W/o. వెంకట సుబ్బయ్య అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా నరసరావు పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కాబడిన ఇంటికి చెందిన ఒరిజినల్ దస్తావేజు (ద.నెం 10414/2005రు) లను ది.19-04-2025న జిరాక్స్ తీయించేందుకు కోట సెంటర్ కు వెళుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్ లో లేదా సెల్ నెం. 7337003820 నందు సంప్రదించ గలరు. అట్లు కాకుండా సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికి వాటిని దుర్వినియోగ పరిస్తే చట్టపరంగా నేను తీసుకును చర్యలకు బాధ్యులగుదురని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) TENALI

I.A. NO. 578/2024 IN O.S. NO. 635/2023

Between :
1) Shaik Suban Bi (died)
2) Shaik Khasim Vali
3) Shaik Kamrunnisa
.... Plaintiffs/ Petitioners
AND
Tamma Baba Vali @ Chinna Babavali
.... Defendent / Respondent

To,
Tamma Baba Vali @ Chinna Babavali, S/o Venkateswarlu, R/o D.No. 15-9-40, Kogantivari Veedhi, Market Area, Tenali, Guntur district.

పై నెంబరు దావాలోని ఐ.ఎ. 578/2024లో మీకు అనేక పర్యాయములు కోర్టు ద్వారా, పోస్టల్ ద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనక అవాయిడ్ చేసియున్నందున పేపరు ప్రచురణ ద్వారా మీ నోటీసుకై వాయిదా ది. 03-05-2025నకు వాయిదా వేసినారు. సదరు తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో మీరు గాని, మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో మీ పరోక్షమున పిటీషను తీర్మానించబడును.

వాయిదాతేది : 03-05-2025

O/o Peta Pitchaiah
Shaik Firoj Basha,
Peta Prathyusha
తెనాలి. **Advocates for Petitioners**
Tenali. Ph : 9293052501.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) TENALI

I.A. NO. 419/2024 IN O.S. NO. 635/2023

Between :
1) Shaik Suban Bi (died)
2) Shaik Khasim Vali
3) Shaik Kamrunnisa
.... Plaintiffs/ Petitioners
AND
Tamma Baba Vali @ Chinna Babavali
.... Defendent / Respondent

To,
Tamma Baba Vali @ Chinna Babavali, S/o Venkateswarlu, R/o D.No. 15-9-40, Kogantivari Veedhi, Market Area, Tenali, Guntur district.

పై నెంబరు దావాలోని ఐ.ఎ. 419/2024లో మీకు అనేక పర్యాయములు కోర్టు ద్వారా, పోస్టల్ ద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనక అవాయిడ్ చేసియున్నందున పేపరు ప్రచురణ ద్వారా మీ నోటీసుకై వాయిదా ది. 03-05-2025నకు వాయిదా వేసినారు. సదరు తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో మీరు గాని, మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో మీ పరోక్షమున పిటీషను తీర్మానించబడును.

వాయిదాతేది : 03-05-2025

O/o Peta Pitchaiah
Shaik Firoj Basha,
Peta Prathyusha
తెనాలి. **Advocates for Petitioners**
Tenali. Ph : 9293052501.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - తెనాలి

లైంగిక వేధింపులు కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం ఈనెల 4న రూరల్ గ్రామం గుడివాడకు చెందిన పాలపర్తి మహేష్ బాబు అదే గ్రామానికి చెందిన మహిళను లైంగికంగా వేధించాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. కాగా అతనిపై గతంలో 6 కేసులు నమోదైన నేపథ్యంలో నిందితుడిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మాచర్ల

గుర్తు తెలియని సుమారు 65 సంవత్సరాల వృద్ధుడు అనారోగ్యం కారణంగా మరణించాడని, వివరాలు తెలిసిన వారు తెలియపరచాలని మాచర్ల పట్టణ పోలీసుస్టేషన్‌వారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తి 108 ద్వారా ఈ నెల 16వ తేదీన మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ఉన్నారు. అదే రోజు సాయంత్రం మెరుగైన వైద్యం కోసం పోలీసు ఎస్కార్ట్ ద్వారా నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అచటి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా 21వ తేదీన సాయంత్రం చనిపోయారని, ఈ గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు వెంటనే తెలియపరచాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆటో డ్రైవర్ ముగ్గురు ప్యాసింజర్‌లను ఎక్కించుకొని బాపట్ల వైపు వెళ్తుండగా చేబ్రోలు సినిమా హాల్ దాటినా తర్వాత ఎదురుగా వస్తున్న టాటా ఇంట్రా వాహనం డ్రైవర్ అతివేగంగా నడుపుతూ సదరు ఆటోని ఢీ కొట్టడంతో ఆటో నడుపుతున్న వ్యక్తి తలకు బలమైన రక్తగాయం అవ్వడంతో అక్కడికక్కడే స్పాట్ లో చనిపోయాడని తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్యాసింజర్లకు ఈప్రమాదంలో ఎటువంటి గాయాలు కాలేదు. విషయం తెలిసిన వెంటనే చేబ్రోలు పోలీస్ వెంటనే స్పాట్ కి చేరుకొని, మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కి తరలించారు. మృతిచెందిన ఆటో డ్రైవర్ గురించి విచారించగా బాపట్ల టౌన్‌కు చెందిన గోదాటి సీతారామయ్య కుమారుడు గోదాటి కిరణ్ (35)గా గుర్తించారు.మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



అగ్ని ప్రమాదంలో వరిగడ్డి దగ్ధం

ప్రజాశక్తి - యడ్లపాడు


అగ్ని ప్రమాదంలో ట్రాక్టర్లోని వరిగడ్డి దగ్ధమైంది. యడ్లపాడుకు చెందిన పి వీరాంజనేయులు ఇతర గ్రామంలో వరిగడ్డి కొనుగోలు చేశాడు. వరిగడ్డి లోడు ట్రాక్టర్ మంగళవారం యడ్లపాడు-జగ్గాపురం రోడ్డులోకి వచ్చింది. రైస్ మిల్లు ఎదురుగా ఎత్తు తక్కువలో ఉన్న విద్యుత్తు తీగలు ట్రక్కులోని వరిగడ్డికి రాసుకుని నిప్పులు రాలాయి. దీంతో వరగడ్డికి మంటలు అంటుకుంటున్నాయి. ప్రమాదాన్ని గుర్తించిన ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. వాహనాన్ని ఊరికి దూరంగా సమీపంలోని చవటి చెరువు కట్ట పైకి తీసుకువెళ్లి వరిగడ్డిని ట్రక్కు నుంచి పైకి లేపి వేరు చేశాడు. వెంటనే వాహనంతో సహా అక్కడి దూరంగా వెళ్లాడు. ప్రమాదంలో వరిగడ్డి పూర్తిగా దగ్ధమైందని, రూ.20 వేలతో దానిని కొనుగోలు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్



విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ, ఎయిడెడ్, కార్పొరేటు పాఠశాల 25 శాతం సీట్లు ఉచితంగా అందించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అనాధలు, హెచ్ఐవి బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ ఓసీ వర్గాలకు చెందిన పిల్లలు ఒకటో తరగతిలో చేరుటకు విద్యాశాఖ దరఖాస్తులు కోరుచున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆధార్, ఓటరు కార్డు, రేషను కార్డు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్తు బిల్లు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదో ఒక గుర్తింపు కార్డు, పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలన్నారు. అర్హులైన విద్యార్థుల ఆధార్ కార్డు ద్వారా ప్రాథమిక వివరాలతో మండల విద్యాశాఖ అధికారి, గ్రామ సచివాలయం http://cse ap govt in వెబ్సైట్ నందు రిజిస్టర్ చేయించుకోవాలని కోరారు. ప్రవేశం కొరకు ఈనెల 28 నుండి వచ్చేనెల 15వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఇ విజయ్‌కుమార్

మొండి బకాయిలపై దృష్టి పెట్టండి : ఎస్ఇ

ప్రజాశక్తి - మాచర్ల

మొండి బకాయిలపై దృష్టి సారించి, విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని విద్యుత్ శాఖ పల్నాడు సూపరింటెండింగ్ ఇంజనీర్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక డివిజన్ కార్యాలయంలో మంగళవారం విజయ్‌కుమార్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.సింగయ్యతో కలసి విద్యుత్ అధికారులతో సమీక్షించారు. విద్యుత్ రెవెన్యూ కలెక్షన్స్, ఇతర డిపార్ట్మెంట్ చెందినటువంటి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలన్నారు. పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించుకుంటూ మెరుగైన పనితీరు ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

త్వరలో ప్రతి ఇంటికీ కుళాయి నీరు

ప్రజాశక్తి - మాచర్ల

జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా త్వరంలోనే ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందుతుందని తహశీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. నీటిపారుదల శాఖాధికారులతో తన కార్యాలయంలో మంగళవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ బుధవారం ఆర్డీవో మురళితో కలసి విజయపురిసౌత్‌లోని నాగార్జునసాగర్ రిజర్వాయర్, మేకలమండి ప్రాంతాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. మేకలమండి వద్ద రిజర్వాయర్‌లోని నీటి లభ్యత తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఆ ప్రాంతంలోనే నీటిని ఎత్తిపోసే ప్రాజెక్టును చేపట్టే అవకాశముందన్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా మండల, పట్టణ పరిధిలోని ప్రతి గృహానికి కుళాయి ద్వారా తాగునీరు ఇవ్వొచ్చన్నారు.

సొంత పంటకే మంట పెట్టుకునే దుస్థితి

కొనుగోలుకు ముఖం చాటేసిన కంపెనీలు - ధరలనూ తగ్గించేస్తున్న వ్యాపారులు



కాలిపోతున్న పొగాకు

ప్రజాశక్తి - పెదకూరపాడు

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. చందాన పొగాకు రైతుల పరిస్థితి తయారైంది. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని షేక్ యాసిన్ కౌలుకు 3.75 ఎకరాలు తీసుకొని ఒక్కో ఎకరానికి రూ.15 వేలు చొప్పున ముందుగానే కౌలు చెల్లించారు. తొలి పైరుగా పత్తి సాగు చేపట్టగా దిగుబడి అంతంత మాత్రంగానే ఉండడంతో ఖర్చులకే సరిపోయింది. మరోవైపు గతేడాది పొగాకు లాభసాటిగా ఉందని రైతులు పొగాకు వైపు వెళ్లారు. అందుకు అనుగుణంగా ప్రైవేటు పొగాకు కొనుగోలుదారులు రూ.14 నుండి 18 వేలకు కొనుగోలు చేస్తామని కొంతమందికి బాండ్లు ఇచ్చారు. మరి కొంతమందికి ఆన్లైన్లో నమోదు చేశామని నమ్మించారు. వైట్ బర్లి, బ్లాక్ బర్లి వాటిలో ప్రత్యేకతను బట్టి ధరలు ఇస్తామని చెప్పారు. దీంతో ఎక్కువ మంది రైతులు పొగాకు సాగుచేశారు. అయితే ఇప్పుడు వ్యాపారులు... మార్కెట్ తగ్గిందంటూ రైతుల వద్ద నుండి సరుకు కొనడం లేదు. దీనికితోడు అకాల వర్షాలతో పొగాకుపై మచ్చలొచ్చాయి. వీటిని అడ్డంపెట్టుకుని నాణ్యత లేదంటూ మరింతగా ధరలు తగ్గించారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆకు తుంచిన తర్వాత ఎండ పెట్టడానికి తాడుకు కడతారు. ఒక్కొక తాడుకు ఆకు కట్టడానికి రూ.50 చొప్పున కాంట్రాక్ట్ పద్ధతిన కట్టారు. ఎకరానికి 500 నుంచి 1000 తాళ్ళు అయ్యే అవకాశముంది. దీంతో రైతుకు నష్టం వచ్చే పరిస్థితిలు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులన్నీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని తమకు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రూ.ఐదు లక్షల నష్టం

యాసీన్, కౌలురైతు, పెదకూరపాడు



పొగాకు వేసి రూ.ఐదు లక్షల వరకు నష్టపోయాను అకాల వర్షం కురవడంతో పొగాకుపై మచ్చలు ఏర్పడ్డాయి. కంపెనీల చుట్టూ తిరిగినా కొనడం లేదు. బేళ్ళు కట్టినా నష్టం తప్పదనే ఉద్దేశంతో ఆకును తగలబెట్టాను. ఇంకా పొలంలో ఉన్నది కూడా నాణ్యంగా లేదు.

ఉత్సాహంగా ఎడ్లపందేలు



ప్రజాశక్తి - వినుకొండ : మండలంలోని శ్రీ మదమంచిపాడు వీరాంజనేయ స్వామి తిరుణాళ్ల సందర్భంగా మక్కెన చినరామయ్య ఆడిటోరియం నందు శుక్రవారం నుండి నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్లపందేలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సోమవారం మంగళవారం నిర్వహించిన పోటీల్లో ఆరు పళ్ల విభాగంలో 930 కిలోల బండలాగటానికి 14 జతల ఎడ్లు పాల్గొనగా బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన ఆత్తోటి శిరీష చౌదరి, శివరామకృష్ణ చౌదరి ఎడ్ల జత 5448-11 అడుగుల దూరం లాటి మొదటి బహుమతి రూ.40 వేలను సాధించాయి. విజేతలకు డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు బహుమతి ప్రదానం చేశారు. రాచర్ల మండలం ప్రకాశం జిల్లాకు చెందిన సురా పూజితరెడ్డి ఆకివీడు ఎడ్ల జత 4720-8 అడుగులతో రెండో స్థానంలో నిలవగా రూ.30 వేల బహుమతిని దూలం కోటిరెడ్డి, ఎస్.నారాయణరెడ్డి అందజేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసనపల్లికి చెందిన నెల్లూరు రామకోటయ్య ఎడ్ల జత 4581-6 అడుగుల దూరంతో 3వ స్థానంలో నిలవగా రూ.25 వేల బహుమతిని నాగిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి కుమారులు అంజిరెడ్డి అందజేశారు. నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన మేక అంజిరెడ్డి ఎడ్ల జత 4500 అడుగులతో 4వ స్థానాన్ని సాధించగా రూ.20 వేల బహుమతిని రోడ్డ అరుణాదేవి, నారాయణమ్మ, రామాంజనేయరెడ్డి, రోడ్డ నాగిరెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాపరెడ్డి అందించారు. తెలంగాణలోని కొదాడ ఎమ్మెల్యే నల్లమల ఉత్తం పద్మావతిరెడ్డి, బాపట్ల జిల్లా బల్లికుర మండలం గంగపాలెం గ్రామానికి చెందిన రాయుడు సుబ్బారావు కంబైన్డ్ జత 4250 అడుగులతో ఐదో స్తానంలో నిలవగా రూ.16 వేల బహుమతిని రామినేని పోలయ్య, కోటయ్య, మణికిరణ్, లికిత అందజేశారు. పార్వతీపురం జిల్లా తెలకపల్లికి చెందిన శ్యామల తరుణ్ తేజ్, నాగర్ కర్నూల్ శివరామకృష్ణ కంబైన్డ్ జత 3781-10 అడుగులతో 6వ స్థానం సాధించగా రూ.14 వేల బహుమతిని సోమేపల్లి బ్రహ్మయ్య అందజేశారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన కె.పద్మా నాయుడు జత 3750 అడుగులతో ఏడో స్థానం సాధించగా రూ.12 వేల బహుమతిని బట్టు శ్రీనివాసరావు, గోపి అందజేశారు. ప్రకాశం జిల్లా కంభం మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన బీరం వెంకటరెడ్డి ఎడ్ల జత 3644 -11 అడుగులతో 8వ స్థానాన్ని సాధించగా రూ.10 వేల బహుమతిని జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం అనంతవరం గ్రామానికి చెందిన పెదవలి బ్రదర్స్ ఎడ్ల జత 3500 అడుగులతో 9వ స్థానాన్ని దక్కించుకోగా రూ.8 వేల బహుమతిని అనుములు పుల్లారెడ్డి, నాగా అంజిరెడ్డి అందజేశారు.

జీవో 20తో నూతన నిర్మాణాలకు బ్రేకు

- సవరించాలంటున్న లైసెన్స్డ్ సర్వేయర్లు
- పర్యవేక్షణ బాధ్యత నుండి ప్రభుత్వం వైదొలిగి తమను అన్యాయం చేయబూనుకుందని ఆవేదన
- నూతన దరఖాస్తులు రాక మున్సిపాల్టీ ఆదాయానికి గండి
- నిర్మాణదారుల్లోనూ సందిగ్ధం

ప్రజాశక్తి-చిలకలూరిపేట



పట్టణాల పరిధిలో గృహ నిర్మాణంపై నిబంధనలను పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన జీవో 20 అన్యాయంగా ఉందని ఎల్‌టిపిలు (లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్స్) వాపోతున్నారు. తమకు ప్రమాదంగా ఉన్న ఈ జీవోను సవరించాలని, లేదా పాత పద్ధతి లోనే పాత నిబంధనలు కొనసాగించాలని కోరుతున్నారు. మరోవైపు ఈ జీవోను ఫిబ్రవరిలో ప్రభుత్వం జారీ చేయగా దాని కారణంగా ఇళ్ల నిర్మాణాలు మందగించాయి. ఇంటి నిర్మాణానికి ప్లాను అనుమతి కోసం ప్రతినెలా రావాల్సిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడమే ఇందుకు నిదర్శనం.

ఇంటి నిర్మాణాలకు ప్లానులు రూపొందించే వారు పట్టణంలో 10 మంది వరకు ఉన్నారు. వీరు రూపొందించే ప్లానను గృహ నిర్మాణదారులు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించి అనుమతి పొందిన తర్వాత నిర్మాణం ప్రారంభిస్తారు. నిర్మాణానికి సంబంధించి వివిధ దశల్లోనూ ప్లాను ప్రకారమే అంతా జరుగుతుందని మున్సిపాల్టీకి గృహ నిర్మాణదారులు నివేదించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఎల్‌టిపిలే కీలకపాత్ర పోషిస్తుంటారు. ఈ విధంగా పట్టణంలో నెలకు 90కుపైగా దరఖాస్తులు వస్తుండేవి. వీటిద్వారా మున్సిపాల్టీకి షుమారుగా రూ.70 లక్షలకుపైగా ఆదాయం వచ్చేది. అయితే జీవో 20 కారణంగా రెండు నెలల నుండి దరఖాస్తులేమీ రాకపోవడంతో గృహ నిర్మాణాలు మందగించి ఎక్కడివి అక్కడే నిలిచి పోయాయి. దీంతో కార్మికులకు పనులు కరువవడంతో పాటు మున్సిపాల్టీకి ఆదాయమూ పడిపోతోంది. గృహ నిర్మాణం చేపట్టాలనుకున్నవారు సైతం సందిగ్ధంలో పడిపోయారు. గతంలో అనుమతి పొందిన ఇంటి నిర్మాణ ప్లానులో ఏమైనా మార్పులుంటే వాటికి గృహ యజమాని బాధ్యత వహించాల్సి వచ్చేది. జరిమానా విధించడమో, అక్రమ నిర్మాణంగా నిర్ధారించడమో వంటి వాటికి గృహ నిర్మాణదారు బాధ్యులయ్యేవారు. తాజా జీవోలో ఇందుకు ఎల్‌టిపిల ను రాష్ట్ర ప్రభుత్వం బాధ్యులను చేస్తోంది. నిబంధనలు మీరితే ప్లాను రూపొందించిన వారి లైసెన్స్‌ను ఐదేళ్లపాటు రద్దవుతుందని, శిక్షార్హులు కూడా అవుతారని పేర్కొంది. అయితే తాము ప్లాను మాత్రమే ఇస్తామని, అందుకు అనుగుణంగా జరుగుతున్నదీ లేనిదీ మున్సిపాల్టీలోని టౌన్‌ప్లానింగ్ విభాగం పర్యవేక్షించుకోవాలని, గృహ యజమానితో మాట్లాడుకోవాలని, అంతేగాని తమను బాధ్యులుగా చేయడం ఏమిటనే ప్రశ్న ఎల్టీపీల నుండి వస్తోంది. ఈ కారణంగా ప్లానులు ఇవ్వడాన్ని ఎల్టీపీలు ఆపేశారు.



జీవో 20 వల్ల తాము ప్లానులను రూపొందించలేని పరిస్థితి వచ్చిందని లైసెన్స్డ్ సర్వేయర్స్ - ఇంజినీర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు డేవిడ్ కృపానందం అన్నారు. గతంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు చేసే పనులన్నీ ఇప్పుడు ఎల్టీలపై వేశారని, దీనికి తోడు ప్రభుత్వం కచ్చితమైన సాఫ్ట్‌వేర్ కూడా రూపొందించలేదని చెప్పారు. ఈ కొత్త జీవో ప్రకారం అయితే తాము అన్యాయమైపోతామని అంటున్నారు. ఒక్కో ఎల్టీపి వద్ద ఇద్దరు ముగ్గురు గుమస్తాలు పనిచేస్తుంటారని, రెండు నెలలుగా తాము ప్లానులు రూపొందించే అవకాశం లేని కారణంగా గుమస్తాలకు జీతాలు కార్యాలయ హద్దులు సైతం ఇవ్వలేకపోతున్నామని, జీవో 20పై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు.

మార్క్సిజం, లెనినిజాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

మార్క్సిజం, లెనినిజాన్ని ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉందని సిపియం సీనియర్ నాయకులు పాశం రామారావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సిపియం కార్యాలయంలో లెనిన్ 155వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కారల్‌మార్క్స్ రూపొందించిన కార్మిక వర్గ సిద్ధాంతానికి లెనిన్ రష్యాలో వాస్తవ రూపం ఇచ్చాడన్నారు. మాస్కిజం శాస్త్రీయతను లెనిన్ నిరూపించాడన్నారు. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా రూపుదిద్దుకోవటంపై, కమ్యూనిస్టులలో అతివాద, మితవాద ధోరణలకు వ్యతిరేకంగా 'ఏమి చేయాలి' అనే గ్రంథం ద్వారా సైద్ధాంతిక గ్రంధాలు రచించాడన్నారు. మార్క్స్ చెప్పిన కార్మికవర్గ సిద్ధాంతాన్ని రష్యా సమాజానికి అన్వయించి ప్రపంచం మొత్తం రష్యా వైపు చూసే విధంగా పరిపాలను అందించాడన్నారు. అదే విధంగా భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ చరిత్రలో అసాధ్యమనుకున్న దానిని సుసాధ్యం చేసిన ధీశాలి లెనిన్ అన్నారు. మార్క్స్ ప్రతిపాదించిన మార్క్సిజాన్ని రష్యా పరిస్థితులకు అన్వయించి విప్లవాన్ని విజయవంతం చేశారన్నారు. దేశంలో కార్మిక చట్టాలను రద్దు చేసి, పెట్టుబడిదారులకు, పారిశ్రామికాధిపతులకు ప్రజల సోమ్మును కారు చౌకగా కట్టబెడుతున్నారని, రాష్ట్రంలో


నివాళులర్పిస్తున్న నాయకులు


పి-4 పేరుతో వేల ఎకరాల భూములను 99పైసలకే బడాబాబులకు లీజుకు ఇస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు బి.లక్ష్మణరావు, వై.కష్ణకాంత్, కాకుమాను నాగేశ్వరరావు, ఎమ్.సాంబశివరావు, నికల్సన్, ఖాశింషహీద్, ఎస్.పద్మ, ఎ. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ..

24న సామూహిక రాయబారం

పొన్నూరు ప్రచారంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చేబ్రోలు


చేబ్రోలులో

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ 24వ తేదీన నిర్వహించే సామూహిక రాయబారం కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం పొన్నూరు ఐలాండ్‌సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని, పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 24న జిల్లాలోని పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సంక్షేమ బోర్డు నుండి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల



పొన్నూరులో

ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికుని కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే 6వేల క్లైములు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎన్ రమేష్ బాబు, నాగేశ్వరరావుపాల్గొన్నారు.

చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో భవన నిర్మాణ కార్మికుల సామూహిక రాయబారం జయప్రదం చేయాలని కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ చేబ్రోలు మండల కార్యదర్శి సిహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ , చంద్రబాబు నాయుడు ఊరూరా తిరుగుతూ భవన సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని చెప్పారని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న ఇప్పటివరకు భవన నిర్మాణ కార్మికులకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో భవననిర్మాణ మండల అధ్యక్షులు చౌడయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏం తిని బతకాలి.. మూణ్ణెల్లుగా వేతనాల్లేవ్ ..

వ్యకాస, రైతు సంఘం నాయకుల ఎదుట ఉపాధి హామీ కూలీల ఆవేదన

వేతన బకాయిలు తక్షణం చెల్లించాలి : వ్యకాస జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు

ప్రజాశక్తి -తెనాలి రూరల్


గుడివాడ గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు,ములకా శివసాంబిరెడ్డి

ఉపాధి కూలీలకు మూడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం తెనాలి మండలంలోని గుడివాడ గ్రామంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డితో ఉపాధి కూలీలతో కలసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు అనే సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. మూడ్నెల్లుగా వేతనాలు లేవని ఏ తిని బ్రతకాల్లో అర్థం కావడం లేదని కూలీలు వాపోయారు. కనీస వేతనం రూ.307 పడటం లేదని కేవలం రూ. 250 రూపాయలు మాత్రమే బిల్లు వస్తుందని తెలిపారు. అలాగే గతంలో మంచినీళ్లకు డబ్బులు చెల్లించే వారని పలుగు పారకు సానపట్టటానికి డబ్బులు చెల్లించే వారిని అవి ఇవ్వటం లేదని తెలిపారు. అలాగే ఐదు కిలోమీటర్లు దూరం వెళ్తే ఆటోలకు చార్జీలు కూడా ఇవ్వటం లేదని వాపోయారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని సమ్మర్ అలవెన్స్ కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఈమని అప్పారావు మాట్లాడుతు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలో చేసిన ఉపాధి హామీ పనులకు వేతన బకాయిలు ఇంత వరకూ చెల్లించకుంటే వారు ఏ విధంగా బ్రతకాలని అధికారులను ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు తగ్గించిందని, అలాగే ఉపాధి హామీ ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తుందని తెలిపారు. ఉపాధి పని పట్ల కూలీలకు శ్రద్ధ తగ్గించేందుకు ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రెండు పూటల మచ్చరు వేయటం, అలాగే మౌలిక వసతులు కల్పించకపోవడం, వేతనాలు టైం కి ఇవ్వకపోవటం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీని కాపాడుకునే దానికోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతు ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని చెబుతూ ఉపాధి హామీ నిధులను భూస్వాములు కట్టబెట్టే దాని కోసం కుట్రలు చేస్తున్నారని తెలిపారు. పనికి వచ్చే సందర్భంలో ఎండల తీవ్రత వల్ల వడదెబ్బ తగిలి మరణిస్తే అటువంటి వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిచేసే సందర్భంలో గాయాలైన వారికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.ఉపాధి హామీకి బడ్జెట్లో 2 లక్షల కోట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

26న జై భీమ్ జనగానం పాటల పండుగ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో ఈనెల 26న జైభీమ్ జనగానం అంబేద్కర్ పాటల పండుగను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో జైభీమ్ జనగానం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ప్రఖ్యాత కవులు జయరాజ్, దేవేంద్రకు భీమ్ అవార్డు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సజనాత్మకత, సాంస్కృతిక సమితి భాషా సాంస్కృతికశాఖ, జాషువా కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి బహుజన వాగ్గేయకారులు పాల్గొని సామాజిక చైతన్య గీతాలు, భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గీతాలను ఆలపిస్తారని తెలిపారు. జాషువా కల్చరల్ సెంటర్ గౌరవాధ్యక్షులు బాలస్వామి మాట్లాడుతూ దళిత సామాజిక సాంస్కృతిక ప్రతిబింబాలైన పాటల కార్యక్రమాన్ని గుంటూరు ప్రజలందరూ తిలకించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు డాక్టర్ పోలే ముత్యం, విసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జె. విద్యాసాగర్, మాజీ క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ మద్దిరాల మ్యాని, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బత్తుల అనిల్, బహుజన పొలిటిల్ సెంటర్ కోఆర్డినేటర్ సాధు మాల్యాద్రి, మాల ఐక్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్, జాషువా కల్చరల్ సెంటర్ ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ఉపాధ్యక్షులు బిళ్ళ నాగరాజు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు

చిరుద్యోగుల జీతాలు సకాలంలో చెల్లించాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

చిరుద్యోగులకు సంబంధించిన జీతాలు ప్రతినెల మొదటి వారంలో క్రమం తప్పకుండా చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఏప్రిల్‌నెల మూడు వారాలు దాటినా మార్చి నెల జీతాలు ఆశా వర్కర్లు, వీఆర్‌ఏలకు నేటి వరకు చెల్లించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్ ఎఫ్) పథకంలో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు 12 నెలలు జీతాలు బకాయి ఉందని తెలిపారు. సిఆర్‌డి ఏలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని ఇటీవల పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు తమ జీతాల చెల్లింపు కోసం నిరంతరం సమ్మెలు చేయాల్సిన పరిస్థితికి నెట్టబడుతున్నారు. అసలే అంతంత మాత్రం జీతాలతో నెట్టుకొస్తున్న చిరు ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు అశ్రద్ధ వహించటం సరైనది కాదని, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వడ్డేశ్వరంలో అర్హులైన పేదలకు

ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో సిపిఎం ముఖ్య నాయకులతో విస్తృత సమావేశం సిపిఎం నాయకులు షేక్ గన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేతాజీ మాట్లాడుతూ వడ్డేశ్వరం గ్రామంలో ఏళ్ల తరబడి ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాకుండా ఉందని అన్నారు. పేదలు అద్దెలు కట్టుకోలేక, పెరిగిన నిత్యవసర ధరలతో సతమతం అవుతున్నారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో, తాడేపల్లి మండలంలో కొన్ని గ్రామాలకే ఇళ్ల స్థలాల పంపిణీ చేశారని అన్నారు. వడ్డేశ్వరం గ్రామంలో అర్హులైన పేదలందరికి, లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు సుమారు 300కు పైగా ఇవ్వాల్సి ఉందన్నారు. తక్షణమే ఇళ్ల స్థలాల, పట్టాల సమస్య పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అర్హులైన పింఛనుదారులకు పింఛన్లు మంజూరు చేసి, అందజేయాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్లను నిర్మాణం చేపట్టి, స్థానిక సమస్యలను పరిష్కరించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, సిపిఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి గుడిసె శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు, ఎస్కే పాపా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-తెనాలి


విద్యుత్ ఇఇకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి బకాయిలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ ఇఇ వివి చిరంజీవికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె బాబు ప్రసాద్ మాట్లాడుతూ చట్ట ప్రకారం విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్మెన్‌లకు ఏడాదికి ఎనిమిది రోజులు పెయిడ్ హాలిడేస్ ఉన్నాయని, ఆరోజుల్లో కూడా పనిచేసిన కార్మికులకు వేతనం చెల్లించాల్సి ఉందన్నారు. 2024 సంవత్సరానికి కార్మికులకు చెల్లింపులు జరగలేదని, అతి తక్కువ వేతనానికి పనిచేసే కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చెల్లింపులకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్ నాగరాజు, గోపీనాథ్, సాంబశివరావు, దాసరి గోపి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

26 నుంచి స్లాటు బుకింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి - క్రోసూరు



మాట్లాడుతున్న విజయ ప్రసాదరావు

ఈ నెల 26వ తేదీ నుంచి స్లాటు బుకింగ్ తప్పని సరి అని క్రోసూరు సబ్ రిజిస్ట్రార్ ఎం . విజయ ప్రసాదరావు అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రెండో దశలో ఈ నెల 26వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు ముందుగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని చెప్పారు. అందులో కేటాయించిన సమయంలోపు ఇరువర్గాల వారు కార్యాల యానికి రావాలన్నారు. ఈ సదుపాయం వలన కక్షిదారులు తమ కోరుకున్న సమయంలో ఎటువంటి ఆలస్యం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఈ స్లాట్ బుకింగ్ వలన రిజిస్ట్రేషన్ ప్రకియ 10 –15 నిమిషాలలో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఎక్కువ సమయం వేచి చూడకుండా ఉండేందుకు ఈ సదుపాయాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. కక్షి దారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. క్రయవిక్రయ దారులు సెల్ఫో న్లకు ఓటీపీ వస్తుందని, అది చెప్పిన తరువాతనే రిజిస్ట్రేషన్ ప్రారంభిసస్తామని తెలిపారు. రోజుకు 39 దస్తావేజులకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. స్లాటు బుకింగ్‌పై అవగాహన కోసం కార్యాల యంలో సంప్రదించాలన్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కత్వా చెరువు ఆక్రమణలను తొలగించిన మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలోని కత్వా ట్యాంకు సర్వే నెం 4/69 ప్రాంతంలో అక్రమార్కులు ఆక్రమణలు చేసి నిర్మించిన నిర్మాణాలను మంగళవారం పట్టణ మున్సిపల్ ప్రణాళికా సిబ్బంది తొలగించారు. ఈ స్థలం ఇరిగేషన్ డిపార్టుమెంట్ వారి అధీనంలో ఉందని, అయినప్పటికి పోలీస్ డిపార్టుమెంట్ సహకారంతో ఆక్రమణలను తొలగించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు తెలిపారు.



ఆక్రమణలు తొలగిస్తున్న

పారిశుధ్యం, బాల్య వివాహాలపై వివరించిన కళాకారులు

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని విఠం రాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం గ్రామ పంచాయితీల్లో కళాజాత వారు ఇంటి పన్ను, బాల్య వివాహాలు, పారిశుద్ధం పైన తడి, పొడి చెత్త, చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాన్ని ఉపయోగించు విధానాన్ని కళాకారులు వివరించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం గురించి ప్లాస్టిక్ కవర్లు మాని గోనెసంచులు గుడ్డ సంచులు వాడాలని, బాల్య వివాహాలు చేస్తే రూ. 2లక్షల జరి మానా విధించడం జరుగుతుందని పాటల ద్వారా జోకులతో నవ్విస్తూ కళాకారులు వెంకట్‌లక్ష్మి, మల్లికార్జునరావు బృందం వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు గ్రామ కార్య దర్శులు శ్రీనివాసరావు మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్ రావు గ్రామ పెద్దలు మహిళలు విద్యార్థులు సచివాలయం పాల్గొన్నారు.

గ్రామాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



భూమి పూజ చేస్తున్న డాక్టర్ రవి నాయక్

రొంపిచర్ల మండలంలో వి.రెడ్డిపాలెం ఏపి మోడల్ స్కూల్, కొత్తపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం జరిగింది. వి.రెడ్డిపాలెం ఏపి మోడల్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి నాయక్ మాట్లాడుతూ భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. వాయు కాలుష్యాన్ని అరికట్టి, ప్రాణవాయువుని ఉత్పత్తి చేయడం కోసం మొక్కలు నాటాలని అన్నారు. స్కూల్‌లో భూమికి పూజలు చేసి మొక్కలు నాటారు. కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలలో విద్యార్థులకు భూమి అవశ్యకత గురించి వివరించారు. మొక్కల పెంప కం, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పాఠశాలలో మొక్కలు నాటారు. అనం తరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మల్లిఖార్జున రావు, ఆయా పాఠశాలల ఎస్ఎంసి ఛైర్మన్లు రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

34వ రోజుకు మున్సిపల్ పారిశుధ్యకార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆప్కాస్ లో ఉన్న తమను బదిలీ కార్మికులమంటూ మున్సిపల్ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం తగదని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఆరేళ్లుగా మున్సిపల్ పారిశుధ్య విభాగంలో నెల మొత్తం పని చేసినా 10 నుండి 15 రోజులకు మాత్రమే వేతనాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 34వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కార్మికులు 34 రోజులుగా పోరాటం చేస్తున్నా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కరోన సమయంలో ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య పనులు చేశామనీ, అయినప్పటికీ తమ పట్ల వివక్ష ఎందుకని ప్రశ్నించారు. తాము పని చేసిన అన్ని దినాలకు న్యాయంగా వేతనాలు ఇవ్వాలన్నారు. కలెక్టర్, అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఆప్కాస్‌లో పేర్లు నమోదు అయితే బదిలీ కార్మికులను ఎలా అంటారని ప్రశ్నించారు. ఆప్కాస్‌లో ఉన్న మిగిలిన కార్మికులు మొత్తం రూ.21 వేలు వేతనం తీసుకుంటున్నారని వారితో పాటు పనిచేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం ఎందుకివ్వరని ప్రశ్నించారు. కార్మికులు ఐక్యంగా ఉండి న్యాయ పోరాటం చేయాలని అధికారుల బెదిరింపులకు లొంగకుండా ధైర్యంగా పోరాటం కొనసాగించాలన్నారు. కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాలలో తాగునీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - అచ్చంపేట



సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

గ్రామాలలో మంచినీటి సమస్యలు లేకుండా చూడాలబోర్లను మరమ్మత్తులు లేకుండా చేపట్టాలంటూ ఎంపీపీ భూక్య స్వర్ణమ్మ భాయ్ అన్నారు మంగళవారం అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవికాలం ఎండలు తీవ్రంగా ఉండటంతో వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందు బాటులో ఉంచాలనీ, ఉపాధి కూలీలకు ఎండ తీవ్రత లేకుండా మంచినీరు మజ్జిగ పంపిణీ చేయాలం టూ అధికారులకు సూచించారు. డిసి ఛైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ గతంలో రెవిన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీలు కానీ ప్రజా దర్బార్లో వచ్చిన సమస్యలు పరిష్కారానికి అధికారులు చొరవ చూపటం లేదన్నారు. విద్యుత్ సమస్యలుంటే ముందుగానే గ్రామాలలో దండోరా వేయించాలని ముఖ్యంగా కృష్ణానది వెంబడి ఉన్న మంచినీటి ట్యాంకులకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలంటూ అధికారులను సూచించారు. అధికారులందరూ సమన్వయంతో సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో శ్రీనివాస రావును ఎంపీపీ కోరారు సమావేశంలో వైసిపి జి నరసింహారెడ్డి టీ నాగరాజు విద్యుత్ ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి రెవెన్యూ పోలీస్ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి మహాప్రభో...!



మురుగుతో నిండిన కాలువ

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో ఎక్కడ చూసినా ఏముంది గర్వకారణం అన్న రీతిలో మురుగుతాండవిస్తోంది. మురుగు సమస్య పరిష్కరించండి మహాప్రభో అంటూ స్థానికులు అధికారులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇటీవల పట్టణ పౌర సంక్షేమ సంఘం, రాజ్యసభ మాజీ ఎంపీ మధు తాడేపల్లి బైపాస్ రోడ్డు అపార్ట్మెంట్లో సముదాయం సమీపంలో నిలిచిన ములుగు సమస్య పరిష్క రించాలని ఆందోళన చేపట్టిన విషయం విదితమే. దుర్గ ఎంక్లేవ్ తదితరచోట్ల కొంతమేర అధికారులు కదిలి పనులు చేసినా మురుగు సమస్య పట్టణ ప్రజలను వెంటాడుతూనే ఉంది. సుందరయ్య నగర్ 21–1 రోడ్డులో మురుగునీరు అంతా ఇళ్ళ ముందు నిలిచిపోతోందని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీటిలోనే వాహనాలు రాకపోకలు కొనసా గించాల్సి వస్తోందని చెబుతున్నారు. బయటికి బురద నీటిలోనే వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. చిన్నపిల్లలను పచారీ షాపులకు పంపించాలంటే భయమేస్తోందని చెబుతున్నారు. తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్ 21–1 రోడ్డులో నిలిచిన మురుగునీటిని మున్సిపల్ అధికారులు తొలగించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సుంద రయ్య నగర్ శాఖ కార్యదర్శి నానిన నాగేశ్వరరావు కోరారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న శాంతి శ్రీనివాసరెడ్డి

పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామ పరిధిలోని ఏఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార లోపం, పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఉన్న పసిపిల్లలలో పౌష్టికాహార లోపంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఆఫ్రికన్ దేశాల్లో పౌష్టికాహార లోపం వల్ల పిల్లల ఎదుగుదల సక్రమంగా లేకపోవడంతో ఆయా దేశాల ప్రభుత్వాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రోత్సహంతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహార లోపం వలన కలిగే ఆరోగ్య సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి దేవిరెడ్డి అశోక్ కుమార్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి భార్గవ్ భూషణ్‌రావు, కళాశాల అకాడమిక్ డీన్‌డాక్టర్‌లక్ష్మీసురేఖ, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక లోడును క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో గృహ అవసరాలకు వినియోగించు విద్యుత్ సర్వీసుల కు అదనపు లోడు పెంచుకునేందుకు విద్యుత్ శాఖ వారు కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలలో 50శాతం రాయితీ కల్పించామని డిఈ వై.ఏడూ కొండలు తెలిపారు. ప్రతి వినియోగదారు తీసుకొన్న లోడ్ కంటే అధిక లోడు వాడుతున్నట్లయితే ఈ అవకాశం ఉపయోగించుకోవాలన్నారు. జూన్ 30వ తారీఖు లోపు క్రమబద్ధికరించు కోవాలన్నారు. అదనపులోడు తగ్గింపు ధరలు వివరాల్లో వివరాలను చూస్తే ఒక కిలో వాట్ మామూలుగా 2250 రూ. వసూలు చేస్తున్నామని దానిని ప్రస్తుతానికి ఏప్రిల్ నెలకి వరకు రూ.1250లకు అంటే 1000 రూపాయలు 50 శాతం రాయితీ ఇస్తున్నా మన్నా రు. అదేవిధంగా2 కిలో వాట్స్ 4450 అయితే 2450 ఇస్తున్నామని, 2000 తగ్గింపు అని, ఇదే రేషియోలో 3 కి లో వాట్స్6650 అయితే 3650 డబ్బులు కట్టాలని రూ.3000 లు ప్రత్యేకంగా తగ్గింపు ఇస్తున్నామన్నారు. అంతే కాకుండా 4 కిలో వాట్స్ తీసుకుంటే 8850 గాను 4850 కట్టించు కుంటున్నా మని 4000 రూపాయలు డిస్కౌంట్ ఇస్తున్నా మన్నారు. 5 కిలో వాట్స్ అయితే రూ.8850లని దాని రూ.4850ల కట్టించుకుంటున్నామని 50 శాతం తగ్గింపు ధరలలో రూ.4000 తగ్గింపు పొందవచ్చు అన్నారు. 5 కిలో వాట్స్ రూ.11,050లని 50 శాతం తగ్గింపు ధరలో అంటే రూ.6,050లు చేస్తామని రూ.5000లు 50శాతం తగ్గింపులో పొందవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారులు ఉపయోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. అనం తరం సిఆర్‌డి ఏ సర్కిల్ సీనియర్ గణాంకాధికారి అజయ్‌కుమార్ ఈ సందర్భంగా పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అశోక్‌కుమార్, అసిస్టెంట్ గణాంకాధికారి చంద్రశేఖర్ ఏఈలు,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున జెట్టి అనిల్ (35) అనే యువకుడు అనారోగ్య కారణంగా మృతి చెందాడు. అనిల్‌కు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వృత్తి రీత్యా పెయింటింగ్ పని చేసే అనిల్ అతి చిన్న వయసులోనే చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. అనిల్ తండ్రి జెట్టి పీటర్ పాల్ సిపిఎం సభ్యుడిగా ఉంటూ కొంతకాలం కిందట చనిపోయాడు. విషయం తెలుసు కున్న సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, బత్తుల సంసోను అనిల్ భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. సిపిఎం గుండిమెడ గ్రామ శాఖ కార్యదర్శి నాగపోగు విజయ రాజు, బత్తుల సంసోన్ గంజిరామారావు, కొచ్చర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

భూమి పరిరక్షణ అందరి బాధ్యత

రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వై డి రామారావు

ప్రజాశక్తి - గుంటూరు

పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య సంరక్షణ, భూమి పరిరక్షణ బాధ్యతలను ప్రతి ఒక్కరూ తీసుకోవల సిన తరుణం ఆసన్నమైనదని రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి రామారావు అన్నారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని భారతీయ విద్యాభవనన్ నిర్వహిం చిన ప్రపంచ ధరిత్రి దినోత్సవం వేడుకలకు ముఖ్య అతిథి గా హాజరైనామాట్లాడుతూ ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా భూమి పరిరక్షణకై అందరూ ప్రతిజ్ఞ చేసి పర్యావరణహిత కార్యక్రమాలను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం వంటి అంశాలతో అవగాహన తరగతులు నిర్వహిస్తామని ఆయన పేర్కొ న్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి హిమ శైలజ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రాం తాలలో మొక్కల పెంపకాన్ని విరివిగా చేపడు తున్నామని, మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ ను బాధ్యతగా స్వీకరించి మొక్కలను చెట్లుగా ఎదిగే వరకు వాటిని సంరక్షించాలని ఆవిడ తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కోశాధికారి రామచంద్ర రాజు మాట్లాడుతూ బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరు భూమి సంరక్షణకై ముందుకు రావాలని, భావితరాలకు కాలుష్య రహిత భూమిని అందజేయడానికి కలిసికట్టుగా పని చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ గుంటూరు రీజినల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నజీనా బేగం మాట్లాడుతూ పరిశ్రమలు బహుళ అంతస్తుల నిర్మాణ దారులు, కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చి పెక్కు సంఖ్యలో మొక్కలు నాటి, తమ సామాజిక బాధ్యతను గుర్తు ఎరగాలని తెలిపారు. ఇంటాక్ గుంటూరు జిల్లా కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ రవి వడ్లమాని, భారతీయ విద్యా భవన్ ప్రిన్సిపల్ హేమాంబ, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, రెడ్ క్రాస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైడి. రామారావు, ఇతర అధికారులు

ప్రజాశక్తి - చేబ్రోలు : సహజ వనరులను పొదుపుగా వాడుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఆర్ సుబ్బారావు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారా కోడూరులో ప్రపంచ ధరిత్రి దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు తెలిపారు. సహజ వనరుల ను పొదుపుగా వాడుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఆర్ సుబ్బారావు అన్నారు. విద్యార్థులకు శక్తి వనరులు పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో వివిధ పాఠశాల నుండి నారా కోడూరు పాఠశాలకు డిప్యూటేషన్‌పై పని చేసి మంగళ వారం రిలీవ్ అయిన ఉపాధ్యాయులకు సత్కరించి వీడ్కోలు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ శ్రీనివాసరావు ఎం వెంకటేశ్వరరావు డివి శ్రీనివాస్ కె ప్రసాద్, ఎన్ ఉమా మహేశ్వరి కృష్ణారావు విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేసిన ప్రధానోపాధ్యాయులు



దీక్షలో కూర్చున్న కార్మికులు

ఏసిసి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి: సిఐటియు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. స్వాధీనం చేసుకున్న భూములను కార్మికులకు న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మంగళవారం దీక్షా శిబిరం వద్ద దీక్షలకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తన అధికారాలను ఉపయోగించి ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 32 సంవత్సరాల నుండి కార్మికుల సమస్య పరిష్కారం కాకపోవడం పట్ల ఆం దోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం పట్ల కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకునే అవకాశం వచ్చిందనీ, ఆ గట్టునుంటారో..... ఈ గట్టునుంటారో తేల్చుకోవాలని అన్నారు. ఎన్నికల సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు సిమెంటు ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమకు నష్టపరిహారం ఇవ్వాలంటూ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 140 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో వి లక్ష్మి, డి రమణ, ఎం శారదా, చరిత శ్రీ, డి రమ్య కూర్చున్నారు. దీక్షలను టి.దుర్గాభవాని, వై రమాదేవి ప్రారం భించారు. కార్యక్రమంలో ఎం గురవయ్య, టి.నాగేశ్వరరావు, కే ఆది నారాయణ, నాగేశ్వరరావు, ఎస్.కె భాషా, పిచ్చయ్య, చారమ్మ, ఎస్ కే ఇమాంబి పాల్గొన్నారు.

చైర్మన్‌తో అధికారులు చర్చలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి బైపాస్ రోడ్డులోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని రీజనల్ బ్యాంక్ మేనేజర్ సుబ్బారావు కలిశారు. సోషల్ వెల్ఫేర్ ఎండి మరియు ప్రభుత్వ కార్యదర్శి ఎం మల్లికార్జునరావు చైర్మన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, పేదలకు పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించే విధంగా కార్యాచరణ రూపొందించి నట్లు కార్పొరేషన్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - తాడికొండ

వేసవికాల దృష్ట్యా గ్రామాలలో తాగునీరు,పారిశుధ్యంపై దృష్టి సారించాలని శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. తాడికొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం తుళ్లూరు, తాడికొండ మండలాల పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టాలని, గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, తహశీల్దార్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులు కారుణ్య ఆశ్రమానికి తరలింపు

ప్రజాశక్తి - తెనాలి

అంబులెన్స్ సాయంతో తెనాలి జిల్లా వైద్యశాలకు చేరిన ఇరువురు నిరాశ్రయులను గోరంట్ల సమీపంలోని కారుణ్య ఆశ్రమానికి తరలించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు. ఈనెల 14న ఒకరు, 17న ఒకరు 108 అంబులెన్స్ సాయంతో అనారోగ్య పరిస్థితులలో జిల్లా వైద్యశాలకు చేరారు. వారికి వైద్య సేవలు అందించిన తదుపరి మున్సిపల్, రెవెన్యూ అధికారులకు సూపరింటెండెంట్ సమాచారం ఇవ్వడంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఓఎస్డీ ఎన్ ఏసురత్నం, తహశీల్దార్ కె.వి. గోపాలకష్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల ఆసుపత్రికి చేరుకొని వారి పరిస్థితిని సమీక్షించారు

ఆత్మీయ వీడ్కోలు సన్మానోత్సవం

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలోని నంబూరు గ్రామం జిల్లా పరిషత్ హై స్కూల్ బాలికలు ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీ వల్లభాపురం శౌరికి ఆత్మీయ వీడుకోలు సన్మానోత్సవం జరిగింది. వల్లభాపురంసౌరి నంబూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికల ఉన్నత పాఠశాలకు వచ్చాక విద్యార్థులకు ఇంగ్లీ ష్ మాధ్యమంలో ఆసక్తిని కలిగించారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యా యుని వసుంధరదేవి ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు సన్మానించారు.

భూమి ఆరోగ్యం, సామర్థ్యంపై శిక్షణ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

గుంటూరు జిల్లా గుంటూరు సబ్ డివిజన్ ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల గ్రామ వ్యవసాయం, ఉద్యాన సహాయకులకు భూమి ఆరోగ్యం, భూమి సామర్థ్యం అనే అంశం మీద శిక్షణ కార్యక్రమం ఫిరంగిపురం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ పంచాలకులు శ్రీ తోటకూర శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.ఫిరంగిపురం మండలం వ్యవసాయాధి కారి వాసంతి మాట్లాడుతూ గ్రామంలోని ఎంపిక చేసిన సర్వే నెంబర్లలో మట్టి నమూనా కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు షేక్ సుభాని, మేడికొండూరు వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్లలో 51 మంది విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కియా మోటార్స్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ కి 51 మంది విద్యార్థులు సెలెక్ట్ అయినట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కోట శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రముఖ కార్ల తయారీ కంపెనీ అయినా కియా మనదేశంలో ఎంతో ప్రాచుర్యం సంపాదించిందని, మంచి మోడల్స్ తో ప్రజలకు ఆకర్షణీయంగా మిడిల్ క్లాస్ ఫ్యామిలీకి అనుకూలమైన ధరలతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఎన్ఆర్ఐ సంస్థల పిడి తిలక్ బాబు కియా కంపెనీకి సెలెక్ట్ అయిన పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులను అభినందించారు. కళాశాల పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కళాశాల మేనేజ్మెంట్ సహకరిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ఆధిపతులు శ్రావణి, వాసు, పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ పి.మనోహర్, కళాశాల ఏవో సీతారామయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహర్ రావు, పాల్గొని ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో కియా నుంచి ఏపీ ఐ టి ఏ డైరెక్టర్ఎం. సత్య రత్నం, ఉమాశంకర్ ఆదిబట్ల కియా మోటార్స్, మానవ వనరుల సీనియర్ ఎగ్జిక్యూటివ్, మనీష్ ఓజార్కర్, కియా మోటార్స్, హెచ్ ఆర్ మేనేజర్, రిక్రూట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

దళితులపై బహిష్కరణ అమానుషం

ప్రజాశక్తి - తెనాలిరూరల్

పిఠాపురం నియోజకవర్గం మల్లామ్ గ్రామంలో జరిగిన బలహీనవర్గాల సాంఘిక బహిష్కరణ సభ్యసమాజం తలదించుకునేలా ఉందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్య వేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక స్టేషన్ రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి సుమారు 80 సంవత్స రాలు గడుస్తున్నప్పటికీ దళితులను సాంఘిక బహిష్కరణలకు గురి చేయడం అన్యాయమన్నారు. ఈ సంఘటనపట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా భాద్యతహించాలని, పిఠాపురం ఎమ్మెల్యే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ ఉదంతపై స్పందించాలన్నారు. లోగడ విద్యుత్ అఘాతంతో మృతి చెందిన బాధిత సురేష్ కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ దుబాయ్ బాబు, కనపర్తి సతీష్ కుమార్, తుమ్మల తులసి, ఏతాటి అనిల్, ఉన్నవ రాజేష్, నల్లగండ్ల రవిచంద్ర, పెరికల అరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవం వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పాలపర్రులోని శ్రీ నారసింహ ప్రభుత్వ పాఠశాల 75 సంవత్సరాల వజ్రోత్సవం వేడుకలు పాఠశాల అభివృద్ధికి తోడ్పడే విధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ ముద్దన శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం పాలపర్రు లోని శ్రీ నారసింహ ప్రభుత్వ పాఠశాలలో వేడుకల పోస్టరు ను పూర్వ విద్యార్థులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావ వేడుకల ప్రధాన ఉద్దేశ్యాన్ని వివరిం చారు. 1950 లో నెలకొల్పిన పాఠశాలకు పూర్వ వైభవం తీసురావడం కోసం పూర్వ విద్యార్థులందరూ కలసి పని చేయా ల్సిన అవసరం ఉందని అన్నారు. పొరుగు గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించి బడిలో చేరేలా ప్రయత్నించాలన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ను నిలుపుకొనాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 5500 మంది విద్యార్థులు ఉన్నత పదవులు అధిరోహించారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే చదువుతో పాటు, లోకజ్ఞానం, శరీరధారుడ్యం, మానశిక ఉల్లాసం లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో దుద్దేంపూడి సత్యన్నారాయణ, పాఠశాల పి.డి.ముద్దన సత్యన్నారాయణ మాట్లాడారు. సభలో పూర్వ విద్యార్దుల సంఘం ప్రధాన కార్యదర్శి జంపని రామారావు, తేళ్ళప్రభాకరరావు, పోపూరి రామచంద్రరావు, నాగ మల్లేశ్వర రావు,ముద్దన మహేష్ జంపని నాగేశ్వరరావు, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎంఇఓ, ఉపాధ్యాయులు



సత్తా చాటిన విద్యార్థులతో మురళి కాంత్ దాసరి

జాతీయస్థాయి ఒలంపియాడ్లో నెహ్రూ నికేతన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తెనాలి

జాతీయస్థాయి ఒలంపియాడ్‌లో స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల ఆవరణలో బుధవారం మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి వెల్లడించిన వివరాల ప్రకారం న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ సంస్థ జాతీయస్థాయిలో ఒలంపియాడ్ నిర్వహించింది. జనరల్ నాలెడ్జ్, గణితం, రీజనింగ్‌తో పాటు స్టెమ్ ఒలంపియాడ్ నిర్వహించింది. ఈ అభ్యాస్ సంస్థ గణితం, బిజినెస్ ఆప్టిట్యూడ్, మెంటల్ ఎబిలిటీ, సైన్స్ మహోత్సవ్, సైన్స్ ఆప్టిట్యూడ్ నిర్వహించింది. ముంబైకి చెందిన ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో మ్యాథ్స్, సైన్స్, జీకే, కంప్యూటర్ ఒలంపియాడ్‌లలో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాం కులు సాధించారు. నిర్వాహకులు పంపిన మెడల్స్, ధ్రువీకరణ పత్రాలు, ప్రశంసా పత్రాలను మేనేజింగ్ డైరెక్టర్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి పాల్గొన్న 78 మందికి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందినట్లు చెప్పారు. విద్యార్థులను విభిన్న ప్రతిభావంతులుగా తీర్చి దిద్దుతున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుండి పాఠశాలలకు వేసవి సెలవులు

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాలలకు రేపటి నుండి జూన్ 11 వరకూ పాఠశాల విద్యాశాఖ వేసవి సెలవులు ప్రకటించింది. జూన్ 12న పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. కావున జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు తప్పనిసరిగా వేసవి సెలవులు అమలు చేయాలని, అందుకు అనుగుణంగా ఉప విద్యాశాఖాధికారులు, ఎంఇఒలు చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా ఇంటర్ విద్య అధికారిగా పద్మ నియామకం

ప్రజాశక్తి-గుంటూరు



జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి (డిఐఇఒ)గా జె.పద్మ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె గుంటూరు డిఐఇఒగా ఎఫ్ఎసి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమవారం రాష్ట్రంలోని పలువురు ప్రిన్సిపాల్స్‌కు పదోన్నతులు కల్పిస్తూ ఇంటర్ విద్య డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు 13 ఏ ళ్ల తర్వాత ఇప్పుడు ప్రిన్సిపాల్స్‌కు పదోన్నతులు ఇవ్వటం గమనార్హం. ఈ ఉత్తర్వుల ప్రకారం అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జె.పద్మకు జిల్లా ఇంటర్ విద్య అధికారిగా పదోన్నతి కల్పించారు. పద్మ 1999లో జూనియర్ లెక్చరర్‌గా సర్వీసులో చేరారు. 2009లో ప్రిన్సిపాల్ పదోన్నతి పొందారు. ఆ తర్వాత డిఐఈఒగా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహి ంచారు. అలాగే ప్రస్తుతం గుంటూరు కార్యాలయంలో ఆర్‌జెడిగా పనిచేస్తున్న అద్దంకి జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ వి.వి.సుబ్బారావుకు నెల్లూరు డిఐఇఒగా ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించారు. దీంతో గుంటూరు ఆర్‌జెడిగా పూర్తి అదనపు బాధ్యతలను జె.పద్మకు అప్పగించారు. అదే విధంగా గుంటూరు జిల్లా, పెనుమాక జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా ఉన్న ఏలూరు జిల్లా ఇంటర్ విద్య అధికారిగా నియమితులయ్యారు.

సెంట్రల్ జిఎస్‌టి నూతన కమిషనర్‌గా సుజిత్ మల్లిక్



ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని సెంట్రల్ జి.ఎస్ .టి నూతన కమిషనర్‌గా సుజిత్ మల్లిక్ మంగళ వారం గుంటూరు కన్నావారితోట లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఐదు జిల్లాల పరిధిలోని పశ్చిమ గోదావరి నుండి నెల్లూరు వరకు విస్తరించి వున్న సెంట్రల్ జీఎస్టీ కమిషనర్‌గా సుజిత్ మల్లిక్ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఆయన భువనేశ్వర్ నుండి గుంటూరుకు ప్రమోషన్ పై వచ్చారు. సుజిత్ మల్లిక్ రూర్కెలాలోని ఆర్.ఈ.సి (ప్రస్తుతం ఎన్ఐటీ) నుండి బీఈ (మెకానికల్ ఇంజినీరింగ్)ను 1997-2001 సంవత్సరాల్లో పూర్తి చేశారు. ఒడిశాలోని ఆంగుల్‌లో నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్‌లో పనిచేశారు. ఆయన 2007లో ఇండియన్ రెవిన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)లో చేరారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కొటిక్స్ (నాసెన్), ఫరీదాబాద్‌లో ప్రొబేషన్ ట్రైనింగ్ పూర్తి చేసిన అనంతరం, ఆయన మొదటి పోస్టింగ్ కోల్‌కతాలోని ఎయిర్ కార్గో కాంప్లెక్స్, ఎన్ఎస్సీబీఐ ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరారు. అక్కడ ఆయన ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్, ఎస్ఐఐబీ, డ్రాబ్యాక్ వంటి విభాగాలను చూసారు.తరువాత కోల్‌కతాలోని కస్టమ్స్ హౌస్‌లో అసిస్టెంట్ కమిషనర్ (పర్సనల్ అండ్ విజిలెన్స్)గా పని చేశారు. ఆ తర్వాత కోల్‌కతా సర్వీస్ టాక్స్ విభాగంలో డెప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం కోల్‌కతా-2 సెంట్రల్ ఎక్సైజ్ కమిషనరేట్‌లో పనిచేశారు. డిజీసీఈఐ, కోల్‌కతాలో డెప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2017లో జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి కస్టమ్స్ లో పనిచేసారు. జీఎస్టీ అమలుకు ముందు, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లతో ఉన్న అంతర్జాతీయ సరిహద్దులోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్‌ల కంప్యూటరైజేషన్‌లో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. 2019 నుండి 2022 వరకు, ఒడిశా ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ న్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో జాయింట్ సెక్రటరీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. ఒడిశా ఐటీ పాలసీ, ఎలక్ట్రానిక్స్ పాలసీ, బిపిఒ పాలసీ రూపకల్పనలో చురుకుగా పాల్గొన్నారు. .సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్‌కు (సీబీఐసీ) తిరిగి వచ్చిన అనంతరం, ఆయన భువనేశ్వర్ జోన్‌లో జీఎస్టీ కస్టమ్స్ విభాగాల్లో పనిచేశారు. వివిధ విభాగాలలో సేవలందిస్తూనే, ఆయన సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్‌లో పీజీ డిప్లొమా పొందారు. అంతేకాక, వరల్డ్ కస్టమ్స్ ఆర్గనైజేషన్ ద్వారా అక్రమ వన్యప్రాణుల వాణిజ్యంలో నిపుణునిగా గుర్తింపు పొందారు.

వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎమ్‌బిఎ, ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్మెంట్ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మొదటి సెమిస్టర్ 1/4 ఫలితాలను వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. ఎంబీఏ, ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ పునః మూల్యంకన ఫలితాలను సైతం మంగళవారమే విడుదల చేసినట్లు శివప్రసాద్ వెల్లడించారు. బీటెక్ 4/1, ,4/4 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ మంగళవారం తెలియజేశారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ అధికారిక వెబ్సైట్ లో పొందుపరిచామని www.anu.ac.inలో విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.



అడ్మిషన్ పొందిన విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చి, పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక కోరారు. విద్యాశాఖ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అడ్మిషన్ పొందిన 29 మంది విద్యార్థినులను డిఇఒ అభినందించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించటానికి ఎంఇఒలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. బడి మానేసిన వారు, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిన వారు కూడా తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారన్నారు. కంప్యూటర్లు, ల్యాబ్‌లు, ఆట స్థలం, మధ్యాహ్న భోజనం, వంటి అనేక సౌకర్యాలతోపాటు, ఆహ్లాదకరమైన వాతావరణంలో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన అందుతుందని, తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం షేక్.ఎండి.ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి అసోసియేషన్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలపై జిల్లాస్థాయిలో జాయింట్‌స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళే విధంగా కృషి చేయాలని నాయకులు కోరగా, త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తాం కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, విజయబాబు, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

ఉమ్మడి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జీల బదిలీలు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

ఉమ్మడి గుంటూరు జిల్లాకోర్టు పరిధిలో పలువురు జూనియర్ సివిల్‌జడ్జిలు బదిలీ అయ్యారు. గుంటూరు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వి.దీప్తిని ఇక్కడే ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నియమించారు. ఆమె స్థానంలో ప్రస్తుతం భీమవరంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.ధనరాజును నియమించారు. గుంటూరు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.నవ్యశ్రీని ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా, ఆమె స్థానంలో జగ్గయ్యపేటలో జూనియర్ సివిల్ జడ్జి మైలాబత్తుల శోభారాణిని నియమించారు. ఎక్సైజ్ కోర్టు జడ్జి జి.స్పందనను విశాఖ జిల్లా యలమంచిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు, ఆమె స్థానంలో గిద్దలూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారాధనమ్మను నియమించారు. గుంటూరు ఆరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (సి ఐ డి కోర్టు) కె.శ్రుతవింద విశాఖపట్నం ఏడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్‌ను నియమించారు. మహమ్మద్ గౌస్ స్థానంలో అనంతపురం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సుజన్‌కుమార్‌ను, రాజమండ్రి 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.జగదీశ్వరిని గుంటూరు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నియమించారు. మంగళగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ బాబును అక్కడే ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. అయిన ఆయన స్థానంలో కాకినాడ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్న లక్ష్మిని నియమించారు. బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.రుక్మిణి పొన్నూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గా నియమించి, అక్కడే ఖాళీగా ఉన్న అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు బాధ్యతలనూ అప్పగించారు. కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.కళ్యాణిని బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. నరసరావుపేట ఒకటవదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.ప్రవల్లిక పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. అక్కడ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.మురళి గంగాధరరావును రంపచోడవరంకు బదిలీ చేశారు. నరసరావుపేటలో ప్రవల్లిక బదిలీతో ఖాళీ అయిన స్థానంలో ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏ.సలోమిని నియమించారు. రేపల్లెలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ కనిగిరి జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ప్రస్తుతం మచిలీపట్నంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవిసాయి శ్రీవాణిని నియమించారు. బదిలీ అయిన వారంతా మే2వ తేదీలోగా కొత్త స్థానాల్లో చేరనున్నారు.

చిప్స్ కాలేజీలో ఓరల్ డోసేజ్ టెక్నాలజీపై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో ఓరల్ డోసేజ్ టెక్నాలజీపై వర్చువల్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎసిజి ల్యాబ్స్ ముంబాయ్ వారి సహకారంతో ఈ శిక్షణ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలిపారు. విద్య, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తొలగిస్తూ, విద్యార్థులకు ఆధునిక ఆధునిక ఫార్మాస్యూటికల్ ఉత్పత్తి ప్రక్రియలు, విన్నూతతలపై అవగాహన కల్పించటానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. ఫార్మాసూటికల్ ప్లాంట్‌లలో వాడే మిషనరీలు, అపరేషన్లపై సమగ్ర అవగాహన, ఔషధాల భద్రత, నాణ్యత కోసం ఉపయోగించే ప్యాకేజింగ్ మెటీరియల్స్ గురించి అవగాహన కల్పించారు.

పిఎస్ఆర్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ డిమాండ్

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ హయాంలో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఉన్న పిఎస్ఆర్ ఆంజనేయులు చేసిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని మాజి మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ డిమాండ్ చేశారు. గుంటూరులోనీ తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పి ఎస్ ఆర్ ఆంజనేయులు తన అధికార పరిధికి మించి గత ప్రభుత్వం లో అనేక తప్పులు చేశారన్నారు. ముంబయిలో ఉన్న సినీనటి కేసులో ఒక పారిశ్రామిక వేత్త మెప్పు కోసం అక్రమ కేసులు విజయవాడలో నమోదు చేశారన్నారు. మానసికంగా కేసులతో ఆమెను చాలా ఇబ్బందులకు గురి చేశారనీ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి తప్పులో ఇంటిలిజెన్స్ చీఫ్ అంజినేయులు ప్రధాన పాత్ర పోషించారనీ చెప్పారు. చివరికి తన ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారనీ ఆరోపించారు. టిడిపి మాజీ ఎమ్మెల్యేలతో మాట్లాడినందుకు సజ్జల రామకృష్ణ రెడ్డి నన్ను టార్గెట్ చేసాడని తెలిపారు. సజ్జల రామకృష్ణ రెడ్డి నా రాజకీయ భవిష్యత్తు నాశనం చేసాడని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ పై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకు అరెస్టులు

పిఎస్ఆర్ అరెస్టుపై మాజీ మంత్రి అంబటి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలు, అవినీతిపరమైన విధానాల నుంచి ప్రజల దష్టిని మళ్లించేందుకే పలువురు ప్రముఖులను అక్రమంగా అరెస్టు చేస్తూ ఉందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. మంగళవారం గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సి. ఎం. చంద్ర బాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా ఐపీఎస్ అధికారి పి.ఎస్. ఆర్ . ఆంజనేయులు, రాజ్ కసిరెడ్డిలను అరెస్ట్ చేశారన్నారు. ఉర్సు సంస్థకు రూ.3వేల కోట్ల విలువైన భూమి 99 పైసలకు కట్టబెట్టారని, రాజధాని నిర్మాణంలో రూ.వేల కోట్ల అవినీతి జరుగుతోందని తెలిపారు. అలాగే ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యంతో 11 నెలల్లో ప్రజల నుంచి ఇంత వ్యతిరేకత రావడంతో అక్రమ అరెస్టు లు చేస్తున్నారనీ తెలిపారు. చంద్రబాబు అరెస్టయినప్పుడు ఉన్న పోలీస్ అధికారులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు అని తెలిపారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ అధికారులపై ఇలా కేసులు పెడతారా? ఐపీఎస్ అధికారులు కూడా ఆలోచించుకోవాలన్నారు. ఈ దుర్మార్గాలకు చంద్రబాబు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాలని ఆయన హెచ్చరించారు. లిక్కర్, ఇసుక, మట్టి పేరుతో ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారనీ చెప్పారు. రాష్ట్రంలోని టీడీపీ నాయకులు, చంద్రబాబు, నారా లోకేష్‌లు విపరీతంగా దోచుకుంటూ, ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. మీరు ప్రతిపక్షంలోకి రాకుండా పోతారా? ఎవరు చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడితే వారిని అరెస్ట్ చేస్తారా? అని ప్రశ్నించారు. మా పార్టీ నుంచి బయటకు వెళ్ళిన విజయసాయిరెడ్డి ఇప్పుడు చంద్రబాబు చేతుల్లో ఉన్నాడని, ఇలాంటి వ్యక్తి మాటలకు, సాక్ష్యాలకు విశ్వసనీయత ఏముంటుందీ? వారి మాటలకు, వాదనలకు విలువ ఏముంటుందీ అని ఆయన ప్రశ్నించారు.